www.peoplesnews.in

హైదరాబాద్

# పీపుల్స్ న్యూస్

ప్రజల గొంతుక...

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్  సంపుటి : 16  సంచిక : 218  ఆదివారం, మే 03, 2026, పేజీలు - 12  వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

## పవన్‌కు సిఎం చంద్రబాబు పరామర్శ



**హైదరాబాద్,మే 2 :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను పరామర్శించారు. ఇటీవల పవన్ కళ్యాణ్‌కు సర్జరీ జరగడంతో ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని పవన్ కళ్యాణ్ నివాసానికి సీఎం చంద్రబాబు వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన సీఎం చంద్రబాబు, తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అలాగే వైద్యుల సలహాలను పాటించాలని కూడా చెప్పారు. తనను పలకరించడానికి వచ్చిన సిఎం చంద్రబాబుకు పవన్ కృతజ్ఞత తెలిపారు.

## అవును.. సముద్రపు దొంగలమే...

- ఇరాన్ నౌకల స్వాధీనంలో అమెరికన్ నేవీ పైరేట్స్ పాత్ర పోషిస్తుంది
- నౌకలలోని చమురంతా అమెరికాకే ఇది లాభసాటి వ్యాపారంలా ఉంది: ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు



**ఫ్లోరిడా,మే 2 :** ఇరాన్ పోర్టుల దిగ్బంధానికి అమెరికా నౌకలు ఎంతకైనా తెగిస్తాయని ట్రంప్ తెలిపారు. అవును అవసరం అయితే తమ బలీయమైన యు ఎస్ నేవీ పైరెట్స్ పాత్ర పోషిస్తుందని తెలిపారు. అమెరికాలోని ఫ్లోరిడాలో శుక్రవారం రాత్రి తరువాత ఆయన ఓ ర్యాలీలో ఉత్సాహంతో ప్రసంగించారు. ఇరాన్‌పై బ్లాకేడ్ సాగుతోంది. ఇరాన్ చమురుతో కూడిన నౌక లు, ట్యాంకరును అమెరికా నౌకాదళాలు స్వాధీనం చేసుకున్న విషయాన్ని బహిరంగంగా ప్రకటించారు. ఈ పని చాలా ఘనంగా జరిగిందని చెప్పా రు. సముద్ర జలాల్లో ఆ నౌకలపైకి చేరుకున్నామని, వాటిని స్వాధీనం చే సుకున్నామని, అందులోని మిగతా2లో...

## వారే.. ప్రభుత్వానికి కళ్లు, చెవులు: సిఎం రేవంత్

- విప్‌లు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలి
- ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి
- సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరిస్తుందన్న నమ్మకం ప్రజలకు కల్పించాలి
- శాసనసభ, శాసనమండలి విప్‌లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన



**హైదరాబాద్,మే 2 :** ప్రభుత్వానికి కళ్లు, చెవులు విప్‌లేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శాసనసభ, శాసనమండలి విప్‌లతో శనివారం సాయంత్రం ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలతో జరిగిన సమావేశంలో రాష్ట్రంలో ప్రజా సమస్యలను విప్‌లు సిఎం దృష్టికి తీసుకెళ్లారు. వేసవి నేపథ్యంలో నియోజవర్గాల్లో త్రాగునీరు, సాగునీటి అవసరాలకు తీసుకోవాల్సిన చర్యలు, ధాన్యం సేకరణలో పురోగతి వివరాలను ముఖ్యమంత్రికి వారు తెలియచేశారు. ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు. విప్‌లు నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిఎం దిశానిర్దేశం చేశారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు స్థానిక జిల్లా మిగతా2లో...



## ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం 6వేల కోట్లు చెల్లింపు
- జూన్ 1లోగా ఆరోగ్య భద్రతా కార్డులను అందిస్తాం
- ఉద్యోగ సంఘాలతో భేటీలో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మే 2 :** వంద రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ. 6వేల కోట్లు చెల్లిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నిధుల ఖర్చు ప్రాధాన్యతలు ఉద్యోగులే నిర్ణయిస్తారని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం మరోమారు భరోసా ఇచ్చారు. ఈ మేరకు సంఘాల నాయకులతోశనివారం సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు పలు హామీలు మిగతా2లో...

## బతుమ్మకుంట ముమ్మాటికీ చెరువే...

- అక్కడ చెరవు పదెకరాల్లో ఉన్నట్లు నాసా చిత్రాలు ఉన్నాయి
- ఎడ్ల సుధాకర్ హైకోర్టుకు వెళ్లడంపై హైడ్రా కమిషనర్ వివరణ



**హైదరాబాద్,మే2 :** హైదరాబాద్ బతుకమ్మ కుంట చెరువు భూమి తనదే అని, అక్కడ తాను వ్యవసాయం కూడా చేసినట్లు హైకోర్టును ఎడ్ల సుధాకర్ ఆశ్రయించిన క్రమంలో అందుకు ఆధారాలు లేవని, అయినా చెరువును ఆక్రమించి వ్యవసయాం చేయడం కూడా నేమేనని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. మిగతా2లో...

## గ్లోబల్ బిజినెస్ హబ్‌గా తెలంగాణ

ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ లోగో ఆవిష్కరణలో శ్రీధర్ బాబు




2లో

## సిరిసిల్ల వాసుల మృతిపై కెటిఆర్ సంతాపం

- ఉస్మానియా మార్చురీ వద్ద మృతులకు నివాళి




**హైదరాబాద్,మే 2 :** శంషాబాద్ వద్ద ఓఆర్‌ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆరుగురు సిరిసిల్ల వాసుల పార్థివ దేహాలకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీ వద్ద ఆయన నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సర్దార్‌నగర్‌కు చెందిన బొల్లి శివకుమార్ (40), బొల్లి లాస్య (35) దంపతులకు కూతురు రిషిక (8) ఉన్నారు. వీరు హైదరాబాద్ సనత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. శివకుమార్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, లాస్య సివిల్‌సప్లై శాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో సిరిసిల్లలో ఉంటున్న శివకుమార్ సోదరి కోడం తేజశ్రీ (శ్వేత) (36), భర్త శ్రీనివాస్ (41), పిల్లలు కృష్ణచంద్ర (14), మాధవ్ (11)తో కలిసి మిగతా2లో...

## సర్వోదయ తెలంగాణ కోసం పాంచజన్యం పూరించాం

- అన్ని వర్గాల ప్రజల సంక్షేమం లక్ష్యంగా పోరాటం
- ప్రజలకు విద్య, వైద్యం కోసం ప్రత్యేక దృష్టి
- ప్రతి అంశంపైనా స్పష్టమైన విధానంతో సాగుతాం
- మీట్‌ద ప్రెస్ కార్యక్రమంలో కవిత



**హైదరాబాద్,మే 2 :** తెలంగాణ రక్షణ సేన ఐదు అంశాలను ప్రధాన అజెండాగా తీసుకుందని కల్వకుంట్ల కవిత అన్నారు. పాంచజన్యం పూరించామని, ఇక విజయపథంలోకి దూసుకుపోతామని అన్నారు. సర్వోదయ తెలంగాణ లక్ష్యంగా పోరాటం చేస్తామని అన్నారు. ఎంత పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా.. పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కవిత మాట్లాడారు. పేదలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందాలన్నదే తమ లక్ష్యం అన్నారు. ధాన్యం కొనుగోళ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజులతరబడి పడిగాపులు కాస్తున్నారు. ధాన్యం కుప్పల పైనే ప్రాణాలు విడుస్తున్నారు. ప్రభుత్వాలు ఇస్తున్న హామీల వల్ల ఉపాధి అంటే హాస్యాస్పదమైంది. మేం చెప్పే ఉపాధి కల్పన అంటే.. ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే కాదు. మిగతా2లో...



## సిబ్బంది, ప్రయాణికులతో మర్యాదగా ఉండాలి

- వేధింపులకు గురిచేయడం సరికాదు
- ఆర్టీసీ అధికారులకు మంత్రి పొన్నం హితవు

**హైదరాబాద్,మే 2 :** కిందిస్థాయి ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికుల విషయంలో ఆర్టీసీ అధికారులు సానుకూలంగా ఉండాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సిబ్బందిని వేధింపులకు గురిచేయకుండా ప్రేమతో, సానుకూల దృక్పథంతో పనులు చేయించాలని డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ సమావేశం నిర్వహించారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలకు జరిగిన సమావేశంలో కార్మిక సంఘాలు లేవనెత్తిన అంశాలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ అధికారులు కింది స్థాయి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పట్ల దురుసుగా మిగతా2లో...

ఆదివారం,
మే 03, 2026

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# గ్లోబల్ బిజినెస్ హబ్‌గా తెలంగాణ

**హైదరాబాద్,మే 2 :** తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ’ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ ఇటూ ఇ ’ అనే అంతర్జా తీయ వేదిక లోగోను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ వేదిక ద్వారా తెలంగాణలోని వ్యాపారులు, ఎగుమ తిదారులు, విద్యార్థులు, స్టార్టప్‌లు, నిపుణులు అంతర్జా తీయ అవకాశాలను అన్వేషించి ప్రపంచ స్థాయిలో విస్తరించే అవకాశాలు కల్పించబడతాయి.మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఇలాంటి అంతర్జాతీయ వేదికలు వ్యాపారవేత్తలకు, ఎగుమతిదారులకు, యువతకు కొత్త అవకాశాలను తీసుకువస్తాయని అన్నారు. తెలంగాణను గ్లోబల్ బిజినెస్ హబ్‌గా నిలబెట్టడంలో ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వ్యాపారులు, ఎగుమతిదారులు, విద్యార్థు లు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని అవకాశా లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసి ముందుకు తీసుకెళ్తున్న సందీప్ కుమార్‌ను ఈ సందర్భంగా మంత్రి అభినందిస్తూ, తెలంగాణ ప్రతిభను ప్రపంచా నికి చేర్చే మంచి ప్రయత్నమని ప్రశంసించారు. ఈ సిరీస్‌లో భాగంగా మొదటి అంతర్జాతీయ మిషన్ సింగపూర్‌లో మే 21 నుంచి 24 వరకు నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో వ్యాపార అవకాశాలు, భాగస్వామ్యాలు, అంతర్జాతీయ నెట్‌వర్కింగ్, మార్కెట్ అవగాహనపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. తదుపరి దశలో ఇతర దేశాల్లో కూడా ఇలాంటి మిషన్లు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని గ్లోబల్ సిరీస్‌గా విస్తరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ (ఇ2ఇ) అనేది అంతర్జాతీయ మార్కెట్లను పరిచయం చేసే ఒక సమగ్ర కార్యక్రమం. ఇందులో బిజినెస్ డెలిగేషన్లు, ఎగుమతి ప్రోత్సాహక పర్యటనలు, విద్యార్థుల గ్లోబల్ ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్‌లు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు, వ్యూహాత్మక నెట్‌వర్కింగ్ కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఈ వేదిక స్థానిక ప్రతిభను అంతర్జాతీయ అవకాశాలతో అనుసంధానించే వంతెనగా పనిచేస్తుంది.

# సిరిసిల్ల వాసుల మృతిపై కెటిఆర్ సంతాపం

(మొదటి పేజీ తరువాయి)

గురువారం హైదరాబాద్‌కు వెళ్లారు. శుక్రవారం రెండు కుటుంబాలు యాదగిరిగుట్ట, స్వర్ణగిరిలో దైవదర్శనా నికి వెళ్లాయి. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో శంషాబాద్ ఓఆర్ఆర్‌పై 16వ ఎగ్జిట్ వద్ద ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు అతివేగంగా ఢీకొన్నది. దీంతో కారు లారీలో ఇరుక్కొని నుజ్జునుజ్జయింది. అక్కడి కక్కడే ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. కారులో నుంచి మృతదేహాలను అతికష్టం మీద వెలికితీశారు. ప్రమాదంలో శివకుమార్, లాస్య, శ్రీనివాస్, చిన్నారులు రిషిక, కృష్ణచంద్ర, మాధవ్ మృత్యువాతపడ్డారు. కోడం తేజశ్రీ(శ్వేత) చావు బతుకుల్లో ఉండగా హైదరాబాద్ ఉస్మానియా దవాఖానకు తరలించారు. అనంతరం కిమ్స్‌కు తరలించారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. సిరిసిల్లకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొల్లి రామ్మోహన్ సోదరుడు బొల్లి రాజు కొడుకు, కోడలు, అల్లుడి కుటుంబాలు మృత్యువాతపడటంతో తీవ్ర విషాదం నెలకొన్నది. విషయం తెలుసుకున్న శంషాబాద్ డీసీపీ యోగేశ్‌గౌతం ఘటనాస్థలానికి చేరుకున్నారు. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి అలసిపోయి రెప్పవాల్చడంతో వేగంగా వెళ్లి కారు ఆగి ఉన్న లారీని ఢీకొట్టి ఉంటుందని డీసీపీ వెల్లడించారు. దర్యాప్తులో ప్రమాదానికి గల కారణాలు తెలుస్తాయని చెప్పారు. సూర్యాపేట నుంచి నూకల లోడ్‌తో నంద్యాలకు వెళ్తుండగా లారీపై ఉన్న తాడిపత్రి సరిగాలేకపోవడంతో, సరిచేసేందుకు పక్కకు ఆపుకొన్నట్టు డ్రైవర్ శ్రీనివాస్ తెలిపారు. తాను డ్రైవింగ్ సీట్‌లోనే ఉన్నానని, క్లీనర్ లారీపైకి ఎక్కి తాడిపత్రి సరిచేస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు.. లారీని ఢీకొట్టిందని వెల్లడించారు.

# బతుమ్మకుంట ముమ్మాటికీ చెరువే...

(మొదటి పేజీ తరువాయి)

ఈ అంశం ఇటీవల పెద్దఎత్తున చర్చకు తెరలేపింది. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ తాజాగా స్పందించారు. బతుకమ్మ కుంటను హైడ్రా అభివృద్ధి చేయడంపై ఎడ్ల సుధాకర్ పిటిషన్ వేశారని తెలిపారు. 1986 నాటి అన్ రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్ మాత్రమే ఆయన వద్ద ఉందని.. రిజిస్టర్డ్ అగ్రిమెంట్ ఉంటేనే రూల్ ప్రకారం చెల్లుబాటు అవుతుందని రంగనాథ్ అన్నారు. బతుకమ్మ కుంట అభివృద్ధిపై డివిజన్ బెంచ్‌కు సుధాకర్ వెళ్లారని.. కంటెంప్ట్ ఆర్డర్‌లో కోర్టు తమను తప్పుపట్టిందని హైడ్రా కమిషనర్ చెప్పారు. డివిజన్ బెంచ్ ఆదేశాల ప్రకారం అక్కడ బోర్డులు, ఇతర నిర్మాణాలు తొలగించామని వెల్లడించారు. హైకోర్టు ఆదేశాలను తాము పాటిస్తామని స్పష్టం చేశారు. సుధాకర్ అసలు అక్కడ చెరువే లేదని అంటు న్నారని.. కానీ 1990 నాటి నాసా శాటిలైట్ ఫొటోల్లో బతుకమ్మ కుంట కనిపిస్తోందన్నారు. 1970లో భారతీయ సర్వే ఆఫ్ ఇండియా నీటి సర్వేల్లోనూ పూర్వం నుంచే చెరువు ఉన్నట్లు తేలిందన్నారు. ఎర్రకుంట పేరుతో 1975 పహనీలలో 563/-1తో బతుకమ్మ కుంట ఉందన్నారు. సుధాకర్ భూమిని చెరువుగా మార్చామనేది నిజం కాదని.. తమ వద్ద ఉన్న అన్ని ఆధారాలను కోర్టుకు సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు నార్సింగ్‌లోని ముష్కిమ్ చెరువు ఆక్రమణ కూల్చివేతలపై ముందుగానే సమాచారం ఇచ్చామని హైడ్రా కమిషనర్ తెలిపారు. సున్నం చెరువు బాధితులతో సమావేశం ఏర్పాటు చేశామని.. సీఎం ఆదేశాలతో వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కూడా ఇస్తున్నట్లు వెల్లడించారు.

ఐలాపూర్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమణలపైనా డ్రైవ్ చేసినట్లు చెప్పుకొచ్చారు. ఇప్పటివరకూ హైడ్రా 2,093 ఎకరాల భూమిని రికవరీ చేసిందన్నారు. ఇప్పుడున్న మార్కెట్ ధర ప్రకారం ఆ భూముల విలువ రూ.80 వేల కోట్ల వరకు ఉంటుందని రంగనాథ్ తెలిపారు.

హైడ్రా పరిధిలో 90 ఎఫ్ఐఆర్‌లు ఇప్పటివరకు నమోదయ్యాయని వెల్లడించారు. ఫాతిమా కాలేజ్ విషయంలో హైకోర్టు ఆదేశాలతో ఎఫ్‌టీఎల్ డిమార్కింగ్ చేయాలని రంగనాథ్ చెప్పుకొచ్చారు.

# ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారు. పీఆర్సీపై తక్షణమే రిపోర్టు అందించాలని అధికారుల కమిటీని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రిపోర్టు ఆధారంగా పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటా మని రేవంత్ భరోసా ఇచ్చారు. జూన్ 1లోగా ఆరోగ్య భద్రతా కార్డులనూ ఉద్యోగులకు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతీ రెండు నెలలకోసారి గుర్తింపు సంఘాలు సమావేశమై సమస్యలపై ప్రభుత్వానికి రిపోర్టు అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏ పథకాన్ని ప్రకటించినా ఉద్యోగులు భుజాన వేసుకుని పని చేశారని ప్రశంసించారు. వారి సహకారంతోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేయగలుగుతున్నామని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసమే మొదటి నిర్ణయం తీసుకున్నామని గుర్తు చేశారు. ఉద్యోగులకు ప్రతీ నెలా మొదటి తారీకునే జీతాలు అందేలా చర్యలు చేపట్టినట్లు రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఉద్యోగ సంఘాలు స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించుకునేలా అవకాశం కల్పించామన్నారు. ఉద్యోగుల బదిలీల విషయంలో గందరగోళం తలెత్త కుండా ప్రణాళిక ప్రకారం చేసినట్లు చెప్పుకొచ్చారు. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల బదిలీలనూ ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామన్నారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతా కార్డుల ప్రతిపాదనపైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. ఈ రెండేళ్ల ప్రజా ప్రభుత్వంలో 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు ఆయన చెప్పుకొచ్చారు. ’ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వం.. మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత మాది’ అంటూ సీఎం భరోసా కల్పించారు.

# సర్వోదయ తెలంగాణ కోసం పాంచజన్యం పూరించాం

(మొదటి పేజీ తరువాయి)

యువత, మహిళలు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి. యువత, మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దే ప్రణాళికలు రూపొందిస్తున్నాం. రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రభుత్వాలు భర్తీ చేయని బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తాం అని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా వస్తామని చెప్పాం.. వచ్చామని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. . అన్ని అడ్డంకులను అధిగమించి తెలంగాణ రక్షణ సేన పేరుతో రాజకీయ వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 20 ఏళ్లుగా కొనసాగుతున్న తెలంగాణ జాగృతి స్వచ్ఛంద సంస్థ అలాగే కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలపై తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని, సర్వోదయ తెలంగాణ లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. పాంచజన్యం పేరుతో ఐదు ప్రాధాన్య అంశాలను తీసుకున్నట్లు కవిత తెలిపారు. ఇప్పుడు ప్రతిపక్షంగా ఉన్నా, భవిష్యత్తులో అధికారంలోకి వచ్చినా ప్రధాన ఫోకస్‌గా ఉంటాయని చెప్పారు. ప్రజల ఆదాయంలో 60 శాతం విద్య, వైద్యం కోసమే ఖర్చవుతోందని.. దీని వల్ల సేవింగ్స్ సాధ్యం కావడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఉచిత విద్య ఇస్తున్నా 75 శాతం మంది ప్రైవేటు సంస్థల్లో చదువుతున్నారని, వారందరికీ కూడా ఉచిత విద్య అందించేందుకు అన్ని లెక్కలు వేసినట్లు తెలిపారు. వైద్యం విషయంలో క్యాన్సర్ వంటి వ్యాధులతో చికిత్సకు డబ్బుల్లేక చనిపోతున్న పరిస్థితి ఉందని కవిత అన్నారు. తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్ని లక్షలు ఖర్చైనా ప్రజల వైద్యం కోసం తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వెనుకడుగు వేయదని హామీ ఇచ్చారు. రైతన్నలకు ఆత్మగౌరవం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కవిత అన్నారు. ప్రస్తుతం కల్లాల దగ్గరే వడ్లు పడి ఉండటం, కొనుగోలు కేంద్రాలు తెరవాలని ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఉందని విమర్శించారు. రైస్ ఎగుమతి చేసే అవకాశాలున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఓ రైతు మక్కల కొనుగోలు కేంద్రంలోనే మరణించిన సంఘటనను ప్రస్తావించిన కవిత.. రైతు ప్రాణానికి విలువ లేకపోవడం బాధాకరమన్నారు. రైతన్నలకు మేలు చేసే విషయంలో తాము చాలా సీరియస్‌గా పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉపాధి అంటే ఒక జోక్‌గా మారిందని.. యువత అవసరాలను ప్రభుత్వం అర్థం చేసుకోవడం లేదని కవిత విమర్శించారు. 18-25 ఏళ్ల జెన్ జీ యువతను నమ్ముతున్నట్లు చెప్పారు. మంచి ఆలోచనలతో వచ్చే 25-45 ఏళ్ల వారికి రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. యువత ఉద్యోగాలు వెతకకుండా ఉద్యోగాలు ఇచ్చేలా తయారవ్వాలని.. గూగుల్, వాట్సాప్ లాంటి సంస్థలు తెలంగాణ నుంచి రావాలని ఆకాంక్షించారు. సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. 65 ఏళ్లు దాటి రిటైర్డ్ అయిన ఐఏఎస్, ఐపీఎస్‌లకు కూడా బ్యాంకులు రుణాలు ఇవ్వటం లేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. అగ్రవర్ణాల్లోని పేదలు, దివ్యాంగులు, మాజీ మావోయిస్టులు, మాజీ సైనికులు, అందరికీ ఇళ్లు కట్టించడం సామాజిక న్యాయమేనని కవిత వివరించారు. అమ్మలా పాలన చేస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, తమ పాలన అలాంటిదే అని కవిత పేర్కొన్నారు. ఇకపోతే తండ్రిగా కెసిఆర్‌ను విమర్శించలేదని, బిఆర్ఎస్ అధ్యక్షుడిపైనే విమర్శలు చేశామన్నారు. తాతు తలపెట్టిన ఐదు అంశాలపై పెద్ద కసరత్తు చేశామని, తమవద్ద ప్రణాళిక ఉందని అన్నారు.

# అవును.. సముద్రపు దొంగలమే...

(మొదటి పేజీ తరువాయి)

చమురును తీసుకున్నామని, ఇదంతా కూడా చాలా లాభసాటి వ్యాపారవ్యవహారం అన్పిస్తోందని ర్యాలీలో తెలిపారు. అమెరికా నౌకాదళాలు ఇప్పుడు ఏకంగా సముద్ర జలాల్లో సాయుధ దోపిడీలకు దిగుతున్నాయని ఇరాన్ మండిపడింది. ఇరాన్ ముడిచమురును తీసుకువస్తున్న రెండు ట్యాంకర్లను అమెరికా నౌకలు అటకాయించడంపై ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సిబ్బంది, ప్రయాణికులతో మర్యాదగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

కాకుండా ఫ్రెండ్లీగా స్నేహపూర్వకంగా పనులు చేయించుకోవాలని మంత్రి అన్నారు. డిపో మేనేజర్లు, ఆర్టీసీ సిబ్బంది.. ప్రయాణికులతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. మే 17 లోగా డిపోలు, బస్ స్టేషన్లలో కార్మికులకు మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని ఆదేశించారు. టాయిలెట్స్, మంచి నీటి సౌకర్యం, ఎలాంటేషన్, పరిశుభ్రత పాటించాలన్నారు. 2023 డిసెంబర్ 9 నుంచి ఆర్టీసీలో మహాలక్ష్మి పథకాన్ని అమలులోకి తీసుకొచ్చామని మంత్రి తెలిపారు. ఖమ్మం, మెదక్, రంగారెడ్డి, నారాయణఖేడ్, బాన్సువాడ, ఇల్లందు లాంటి కొన్ని డిపోలు నష్టాల్లో ఎందుకు నడుస్తున్నాయో ఆర్ఎంలు, డిపో మేనేజర్‌లు సమీక్షించుకోవాలన్నారు. టికెట్‌కు సంబంధించి ఏదైనా ఇబ్బందులు జరిగితే చర్యలు తీసుకోవాలని.. సిబ్బంది గొడవలు పెట్టుకోవడం సరికాదన్నారు. సంస్థలో ఇంటర్నల్ ఎటాక్ అనేది ప్రమాదకరమైన విషయమని అన్నారు. ప్రతి రెండో మంగళవారం ఆర్టీసీ సిబ్బంది సమస్యలు వినడానికి అన్ని డిపోల్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని.. డిపో మేనేజర్లు, ఇతర సిబ్బంది అందుబాటులో ఉండాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్లు.. గ్రామ సర్పంచ్ నుంచి మొదలు ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మంచి ప్రజా సంబంధాలు కొనసాగించాలని సూచించారు. ’ఏదైనా సమస్య మీ స్థాయిలో పరిష్కారం కాకపోతే ఆర్టీసీ ఎండీ స్థాయిలో పరిష్కారం చేద్దాం. సిబ్బంది పట్ల సానుకూలంగా ఉండాలి. మంత్రి నుంచి సిబ్బంది వరకు అందరం కలిసి పని చేద్దాం. ఆర్టీసీ సమ్మెలో కార్మికులు డిమాండ్ చేసిన సమస్యలను పరిష్కారం చేస్తున్నామని.. భవిష్యత్తులో మంచి ఫలితాలను సాధించే దిశగా ముందుకు వెళ్దామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. జూమ్ సమావేశంలోఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడీలు, ఆర్ఎంలు, వివిధ విభాగాల హెచ్ఓడీలు, డీఎంలు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్లను కెటిఆర్, హరీష్ బెదిరిస్తున్నారు

**హైదరాబాద్,మే 2 :** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి టి. హరీష్ రావు రాష్ట్రంలోని కొంత మంది కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు. టిఆర్ఎస్ వ్యవస్థాపిక అధ్యక్షురాలు కవిత చేసిన ఆరోపణలకు సమాధానం ఇవ్వకుండా తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తారా? అని వారు శనివారం విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. బావా బావమరిది పోటీ పడి మరీ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని వారు విమర్శించారు. హరీష్ రావు బ్లాక్‌మెయిల్ రావుగా మారుతున్నారని వారు విమర్శించారు.నిబంధనల ప్రకారం టెండర్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. పదేళ్లు అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనేందుకు ముందుకు రాలేదని వారు చెప్పారు. హ్యామ్ రోడ్ల కాంట్రాక్టర్లకు ఫోన్ చేసి హరీష్ రావు బెదిరిస్తున్నారని ఆరోపించారు. హ్యామ్ రోడ్ల టెండర్ల పైన ఇంకా నిర్ణయం తీసుకోలేదని వారు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంటే, ప్రతిపక్షంలో కూడా సంపాదించాలన్నదే వాళ్ల ఆలోచన అని, సంపాదనే వాళ్ల పరమావధి అని వారు విమర్శించారు. హరీష్ రావుకు ధైర్యం ఉంటే తమతో చర్చకు రావాలని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు.

# వారే.. ప్రభుత్వానికి కళ్లు, చెవులు: సిఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని సిఎం సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని, సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరిస్తుందన్న నమ్మకం ప్రజలకు కల్పించాలని సిఎం తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడానికి ప్రసార మాధ్యమాలను ఉపయోగించుకోవాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సిఎం సూచించారు. ప్రభుత్వ విప్‌లతో సమన్వయం చేసుకునేందుకు, ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వారంలో ఒక రోజు విప్‌లకు అందుబాటులో ఉంటానని సిఎం తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ ఎంపి వేం నరేందర్ రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, విజయరమణారావు, రామచంద్రు నాయక్, వేముల వీరేశం, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్‌లు పాల్గొన్నారు.

# రైతు సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలం

## ● సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం




**సిద్దిపేట,మే 2 :** రైతన్నల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం రుణమాఫీ చారాణ చేసి.. బారాణ ఎగ్గొట్టిందని ఎద్దేవా చేశారు. శనివారం కుకునూర్‌పల్లి మండల కేంద్రంలోని బీరప్ప ఆలయ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. హరీశ్‌రావు సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో పలువురు చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఆశీస్సులతో సిద్దిపేట జిల్లాలో ఎక్కడలేని విధంగా బీరప్ప దేవాలయాన్ని అనాడు కేసీఆర్ చాలా చక్కగా నిర్మించారని తెలిపారు. ఒకప్పుడు గజ్వేల్‌లో మూగజీవాలకు నీరు, గ్రాసం దొరక్క జీవాలను మేపడానికి ఎక్కడికో వెళ్తుండేవారని.. కానీ కొండపోచమ్మ , మల్లన్నసాగర్ ప్రాజెక్టుతో నీరు, గ్రాసం కోసం వేరేవాళ్లు ఇప్పుడు మన దగ్గరకు వస్తున్నారని చెప్పుకొచ్చారు. జీవాలకు నట్టల మందు కూడా ఇవ్వడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చేతకావట్లేదని సెటైర్లు గుప్పించారు. బీఆర్ఎస్ హయాంలో భూముల ధరలకు రెక్కలు రాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక భూములను కోనేవారు, చూసేవారు లేరని హరీశ్‌రావు విమర్శించారు.

# మందుపాతర పేలి ముగ్గురు జవాన్ల మృతి

**కాంకేర్,మే 2 :** కాంకేర్ జిల్లాలో భూమిలో ఉన్న మందు పాతరలను తొలగించే క్రమంలో ఓ మందుపాతర (ఐఇడి) పేలి ముగ్గురు జవాన్లు మృతి చెందారు. ఈ ఘటన శనివారం కాంకేర్-నారాయణ్‌పూర్ సరిహద్దు సమీపంలో జరిగింది. ఛోటేబెతియా పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసుల బృందం మావోయిస్టులు అమర్చిన మందుపాతరలను తొలగించే క్రమంలోనే ఈ ఘటన జరిగింది. మృతి చెందిన వారు జిల్లా రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి)లు. ఇన్‌స్పెక్టర్ సుఖ్రామ్ వట్టి, కానిస్టేబుల్ కృష్ణ కొమ్రా, కానిస్టేబుల్ సంజయ్ గఢ్‌పాలేలు పోలీసులు ధృవీకరించారు. ఈ ఘటనలో మరొక కానిస్టేబుల్ పరమానంద్ కోమ్రా తీవ్ర గాయాలపాలయ్యారు. ఆయన ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారు.

## ఇందిరమ్మ ఇంటికి గృహ ప్రవేశం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క







**ములుగు జిల్లా ప్రతినిధి మే 01 (పీపుల్స్ న్యూస్):** వెంకటాపూర్ మండలం సింగరకుంట పల్లి గ్రామంలో రాష్ట్ర ప్రజా ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇంటికి గృహ ప్రవేశం కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొని వారి కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, పంచాయతీ రాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు చెన్నోజు సూర్యనారాయణ సీనియర్ నాయకులు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఫతే నగర్ డివిజన్ నేతాజీ కాలనీలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం

**-- ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్**



**బాలానగర్ మే 03 ( పీపుల్స్ న్యూస్)**మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని నేతాజీ కాలనీ పైప్ రోడ్డులో గల రివైవల్ చర్చ్‌లో పాస్టర్ మాథ్యూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులను ఉద్దేశించి సతీష్ గౌడ్ మాట్లాడుతూ" వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా ఇలాంటి శిక్షణ శిబిరాల్లో పాల్గొని నైతిక విలువలు, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి. చదువుతో పాటు ఆటపాటలు, కళలు నేర్చుకుంటేనే బంగారు భవిష్యత్తు సాధ్యం" అని సూచించారు. అనంతరం పాస్టర్ మాథ్యూ మరియు వారి టీమ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "చిన్నారుల సర్వతో ముఖాభివృద్ధి కోసం ప్రతి సంవత్సరం ఇంత చక్కని శిబిరం నిర్వహిస్తున్న మాథ్యూ పాస్టర్ కు, వారి టీమ్‌కు నా హృదయపూర్వక అభినందనలు. మీ సేవలు సమాజానికి ఆదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చర్చ్ కమిటీ సభ్యులు, వాలంటీర్లు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కంచి బిక్షపతి, భాగయ్య, సురేందర్ నాయుడు మరియు చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారులకు స్వీట్లు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు

## కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలపై భారీ పెంపు -- వ్యాపార వర్గాలకు పెనుభారం

**-- జాతీయ దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బూదాల బాబూరావు**



**బాలానగర్ మే 03 ( పీపుల్స్ న్యూస్):**దేశవ్యాప్తంగా కమర్షియల్ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన భారీ పెంపు సంచలనంగా మారింది. ఒక్కసారిగా రూ.993 మేర పెంచడం ద్వారా ఇంధన ధరల పెంపుపై జాతీయ దళిత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బూదాల బాబూరావు తెలిపారు. చరిత్రలోనే అరుదైన నిర్ణయంగా ఇది నిలిచింది. ఈ కొత్త ధరలు మే 1 నుంచే అమల్లోకి రావడంతో చిన్న వ్యాపార వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.3,315కు చేరుకుంది. అలాగే 5 కేజీల సిలిండర్‌పై రూ.261 పెంపు అమలులోకి వచ్చింది. అయితే గృహ వినియోగ (డొమెస్టిక్) సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు చేయకుండా యథాతథంగా కొనసాగిస్తు న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వ్యాపారాలపై తీవ్ర ప్రభావం ఈ పెంపు ప్రభావం ముఖ్యంగా హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, కేఫ్‌లు, హాస్టళ్లు మరియు ఇతర చిన్న వ్యాపారాలపై పడుతోంది. ఇప్పటికే పెరుగుతున్న ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ వర్గాలు, తాజా ధరల పెంపుతో మరింత ఒత్తిడికి గురవుతున్నాయి. వంటగ్యాస్ ఖర్చులు పెరగడంతో ఆహార పదార్థాల ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లో ఏర్పడిన అస్థిర పరిస్థితులు, ముడి చమురు ధరల మార్పులు వంటి కారణాల వల్లే ఈ పెంపు అవసరమైందని ఆయిల్ కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి. గ్లోబల్ స్థాయిలో సరఫరా-డిమాండ్ అసమతుల్యత ప్రభావం దేశీయ ధరలపై పడుతోందని పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ధరల పెంపు వ్యాపార వర్గాలు ఆవేదన వ్యక్తంచేశారు."ఇప్పటికే అద్దెలు, సరుకు రవాణా ఖర్చులు పెరిగాయి. ఇప్పుడు గ్యాస్ ధరలు ఇలా పెరిగితే వ్యాపారం కొనసాగించడం కష్టమవుతుంది" అని చిన్న హోటల్ యజమానులు వాపోతున్నారు. కొందరు ధరలు పెంచక తప్పదని చెబుతుండగా మరికొందరు వ్యాపారం మూసివేయాల్సి వస్తుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కమర్షియల్ గ్యాస్ ధరల భారీ పెంపు దేశవ్యాప్తంగా వ్యాపార వర్గాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. దీని ప్రభావం త్వరలోనే సాధారణ వినియోగదారులపై కూడా పడే అవకాశముండటంతో, ప్రభుత్వం ఈ అంశంపై పునరాలోచన చేయాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

# పోరాట స్ఫూర్తికి చిహ్నామే మేడే

### కార్మిక సోదరులకు మేడే శుభాకాంక్షలు లక్ష్మీదేవిపేట గ్రామ సర్పంచ్ బొమ్మకంటి వంశావతి రమేష్



**ములుగు జిల్లా ప్రతినిధి మే 01 (పీపుల్స్ న్యూస్):** వేంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట గ్రామంలోమేడే సందర్భంగా కొబ్బరికాయ కొట్టి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపిన లక్ష్మీదేవిపేట గ్రామ సర్పంచ్ బొమ్మకంటి వంశావతి రమేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల పోరాటాల్లో నుంచి పుట్టింది మేడే. సర్వసంపదలు సృష్టించేది శ్రామిక వర్గం. శ్రమ జీవులు ప్రపంచ వ్యాప్తంగా తమ సత్తా ఏమిటో చాటారు. 8 గంటల పని హక్కు కోసం ఆనాటి ప్రభుత్వాల మెడలు వంచి పని గంటల హక్కు సాధించారు. తమ హక్కుల సాధన కోసం వందలాది మంది ప్రాణాలర్పించారు. 1886 మే 3వ తేదీన చికాగో లోని హే స్క్వేర్ వద్ద పోలీసు కాల్పుల్లో ఒక వైపు రక్తం చిందుతుంటే మరోవైపు ఆ రక్తంలో తడిచిన ఎర్రబట్టను తమ జెండాగా పైకెత్తి చూపారు. కార్మికవర్గ త్యాగం అంటే అది. కార్మిక హక్కులు, పోరాటాలు, త్యాగం తోనే సాధించుకోవాలని వారు అన్నారు వందలఏళ్లుగా శ్రమనే ఆయుధంగా మలుచుకొని,తమ రక్తాన్ని చెమటగా చిందిస్తూ,తమ అభివృద్దే ఈ దేశ అభివృద్ధిగా భావిస్తూ, చాలి చాలని బ్రతుకులతో బుక్కెడు బువ్వకోసం అహర్నిశలు పాటుపడుతూ దేశ అభివృద్ధి కోసం తమ శ్రమను ప్రథమ భాగం గా తమ భుజస్కంధాల మీద వేసుకొని నవభారత నిర్మాణంలో ఈ రోజుకు మానవ సమాజానికి ఆగపించని అగ్రభాగం తామే అయ్యి సమసమాజాన్ని నిర్మిస్తున్న ప్రతీ రంగంలో పనిచేస్తున్న నా కార్మిక,ఖర్షక సోదరులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండ తిరుపతి తో పాటు కార్మిక సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు

## మే డే సందర్భంగా ములుగు మున్సిపాలిటీ లో హమాలీల సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేసిన మంత్రి సీతక్క








**ములుగు జిల్లా ప్రతినిధి మే 01 (పీపుల్స్ న్యూస్):**ములుగు జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయం ప్రాంగణంలో హమాలీల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సీతక్క పాల్గొని కార్మిక జెండాను ఆవిష్కరించారుఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో కార్మికుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి కార్మికుల కృషి పునాది వంటిదని, వారి శ్రమ వల్లే ఆర్థిక వ్యవస్థ బలపడుతోందని తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు.ప్రతి కార్మికుడు గౌరవంతో జీవించే హక్కు కలిగి ఉండాలని, వారికి తగిన వేతనం, భద్రత, ఆరోగ్య సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆమె స్పష్టం చేశారు. కార్మికులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మున్సిపల్ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ, వార్డు కౌన్సిలర్ లు, హమాలీల సంఘ ప్రతినిధులు, కార్మికులు ప్రజలు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా కేశపూర్ గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించిన మంత్రి సీతక్క

**ములుగు జిల్లా ప్రతినిధి మే 01 ( పీపుల్స్ న్యూస్):**ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం కేశాపూర్ గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం పనులను గౌరవ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కూలీలతో కలిసి పలుగు, పార చేతబట్టి పనిలో పాల్గొని వారితో అనుబంధాన్ని పంచుకున్నారు. కూలీల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ వారి పనితీరును అభినందించారు. అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసి, తీవ్ర ఎండల నేపథ్యంలో ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తగినంత నీరు తాగడం, విరామాలు తీసుకోవడం, అవసరమైన రక్షణ చర్యలు పాటించడం వంటి అంశాలను వివరించారు. కూలీలకు ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూలీలు పాల్గొన్నారు.







## దివంగత నేత మాజీమంత్రి పీజేఆర్ అవార్డ్ ప్రకటనపై కర్క నాగరాజు హర్షం

**-- పీజేఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, ఐఎన్టీయుసీ నేత కనక నాగరాజు**

**బాలానగర్ మే 03 ( పీపుల్స్ న్యూస్):** మేడే ను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ రవీంద్ర భారతిలో వచ్చే సంవత్సరం నుండి అర్హులైన కార్మికులకు పీజేఆర్ లైఫ్ టైమ్ అవార్డు ప్రకటించడం పట్ల కూకట్ పల్లి పీజేఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు, నియోజకవర్గ ఐఎన్టీయుసీ అధ్యక్షులు కర్కనాగరాజు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దివంగత నేత కార్మిక నాయకుడు పీజేఆర్ పేరుపై లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డ్ ఇవ్వడం పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి, కార్మిక శాఖ మంత్రికి, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పీజేఆర్ కు న్యాయం జరిగిందని, గత సంవత్సరం గచ్చిబౌలి లో ఫ్లైఓవర్ కు పీజేఆర్ పేరు పెట్టడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ భవిష్యత్ తరాలకు కూడా పీజేఆర్ పేరు గుర్తుండే విధంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ఆనందం వ్యక్తం చేశారు. పీజేఆర్ కాంగ్రెస్ పార్టీకి కార్మిక లోకానికి చేసిన సేవలు మరువలేనివని,1995 లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వాన్ని సీ.ఎల్.పీ నేతగా కేవలం 26 మంది ఎమ్మెల్యేల తో అప్పటి ప్రభుత్వాన్ని ప్రజాసమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారని




తెలిపారు. స్వపక్షమైనా, విపక్షమైనా ప్రజా సమస్యలపై తన గళాన్ని విప్పి సమస్యలను పరిష్కరించారు. హైదరాబాద్ నగరంలో స్లామ్ బస్తీలలో పేద ప్రజల నివసిస్తునున్నారంటే కేవలం పీజేఆర్ కృషి వల్లనే, 610 జీవో, పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటరీ, ఆలమట్టి డ్యామ్, ముల్కీ నిబంధనలు, హైదరాబాద్ నగరానికి కృష్ణా జలాలు, మరియు గోదావరి జలాలు, భవిష్యత్తు ను దృష్టి లో పెట్టుకొని హైదరాబాద్ నగరానికి మెట్రో కావాలని ఢిల్లీ కి వెళ్లి అప్పటి మెట్రో పితామహుడు శ్రీధర్ ను కలిసి పోరాటం చేశారు. పెద్దమనుషుల ఒప్పందం , తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయంపై అసెంబ్లీలో ఆయన చేసిన పోరాటం చరిత్రలో నిలిచి పోతుందన్నారు. అన్న అంటే నేను ఉన్నా అనే విధంగా రాష్ట్రం లో ఎవ్వరికి ఏ కష్టం వచ్చినా స్పందిస్తూ కార్మికుల సమస్యలపై యాజమాన్యాలతో నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి అని కొనియాడారు. ఐడిల్ పరిశ్రమలో 20 మంది కార్మికులు డిటనేటర్ పేలి మరణిస్తే యాజమాన్యాన్ని ఒప్పించి అప్పట్లో ఒక్కొక్కరికి 15 లక్షలు,మెడికల్ ట్రీట్మెంట్, మరియు కుటుంబసభ్యులకు ఒకరికి ఉద్యోగం ఇప్పించడం దేశంలోనే చర్చనీయాంశం అయ్యింది. సోనియా గాంధీ పీజేఆర్ చేసిన పనిని అభినందించారు. కూకట్ పల్లి మూసాపేట్ ప్రాంతంలో శ్రీకాకుళం కు చెందిన వలస కార్మికులు సెప్టిక్ ట్యాంకు లో గాలి ఆడక చనిపోతే యాజమాన్యం తో పోరాడి ఒక్కొక్కరికి రూ.15 లక్షలు ఇప్పించారు. ఇలా కార్మికులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తన సమస్యగా భావించి కార్మికుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. వారు చేసిన సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వచ్చే సంవత్సరం నుండి లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డ్ కార్మికులకు ఇస్తామని ప్రకటించడం పట్ల నిజమైన కార్మిక నాయకుడికి ఘనమైన నివాళి అర్పించినట్లయింది. తన తండ్రి చేసిన సేవలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విజయం సాధించిన ఖైరతాబాద్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ విజయారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# 10 వ తరగతి ఫలితాల కంటే పిల్లల ప్రాణాలు విలువైనవి.

**ఉత్తమ విద్యా సేవా అవార్డు గ్రహీత బొడ్డు బాబురావు**



**ఖమ్మం/మే02/(పీపుల్స్ న్యూస్):**పదవ తరగతి పరీక్షా ఫలితాలు వచ్చాయి. చాలా ఇళ్లలో ఆశలు, ఆందోళనలు, ఉత్కంఠ కలిసి కనిపిస్తున్నాయి.కొందరు మంచి మార్కుల కోసం ఎదురు చూస్తుంటే, మరికొందరు “ఏమవుతుందో?” అనే భయంతో ఉన్నారు. కానీ ఈ సమయంలో ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే --- “ఫలితాలు జీవితాన్ని నిర్ణయించవు, అవి కేవలం ఒక దశను మాత్రమే సూచిస్తాయి. ”ఈరోజుల్లో పోటీ ప్రపంచం వేగంగా మారుతోంది. మార్కులు, ర్యాంకులు, సీట్లు, ఉద్యోగాలు అనే పేరుతో పిల్లలపై అధిక ఒత్తిడి పెరుగుతోంది. కొందరు తల్లిదండ్రులు తమ ఆశలను పిల్లలపై మోపుతున్నారు.పక్కింటి పిల్లాడి కి అన్ని మార్కులు వచ్చాయి”, “నీకెందుకు రాలేదు?” అనే పోలికలు పిల్లల మనసును గాయపరుస్తాయి. పెద్దలు తప్పక తెలుసుకోవల్సింది ఏంటంటే పిల్లలు మన నుండి ప్రేమ, ప్రోత్సాహం కోరుకుంటారు గానీ పోలికలు మాత్రం కాదు.ఒక పరీక్షలో తక్కువ మార్కులు రావచ్చు. ఫెయిల్ కావచ్చు కూడా. కానీ అది ఓటమి కాదు.మళ్లీ ప్రయత్నించే అవకాశం మాత్రమే. ఈ ప్రపంచంలో గొప్ప స్థానాలు చేరిన ఎంతో మంది ఒకప్పుడు అపజయాలు చవిచూసిన వారే.ఉదాహరణకు థామస్ ఎడిసన్ చిన్ననాట చదువులో ఇబ్బందులు ఎదుర్కొన్నారు, తర్వాత ఈ ప్రపంచానికి వెలుగు ను అందించే ఆవిష్కర్త అయ్యారు.ఆల్బర్ట్ ఐన్ స్టీన్ బాల్యంలో సాధారణ విద్యార్థిగా భావించబడ్డారు, తర్వాత మహా శాస్త్రవేత్తగా నిలిచారు.ఏ. పి. జె. అబ్దుల్ కలాం గారు పేదరికం, ఎన్నో కష్టాలు ఎదుర్కొని గొప్ప శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా ఎదిగారు.విద్యార్థులకు ఒక మాట మీ విలువ మార్కులతో కొలవబడదు. మీలో ప్రతిభ ఉంది, సామర్థ్యం ఉంది, కొత్తగా మొదలుపెట్టే శక్తి ఉంది. ఏ ఫలితం వచ్చినా ధైర్యంగా స్వీకరించండి. కష్టసమయంలో ఒంటరిగా ఉండకండి. తల్లిదండ్రులతో, ఉపాధ్యాయులతో, స్నేహితులతో మాట్లాడండి. సహాయం కోరడం బలహీనత కాదు.తల్లిదండ్రులకు ఒక వినతి రేపటి రోజు మీ పిల్లలకు న్యాయనిర్ణేతలుగా కాకుండా వారికి అండగా నిలవండి. ఫలితం చూసి మందలించడం, అవమానించడం, ఇతరులతో పోల్చడం మానండి. వీలైతే ఆప్యాయత గా హత్తుకోవడం, “ఫలితం ఏదైనా మీకు తోడుగా ఉన్నాం” అనే మాట పిల్లల జీవితాన్ని కాపాడగలదు.మార్కులు కాదు, మనుషులు ముఖ్యం.ర్యాంకులు కాదు, పిల్లల ఆనందం ముఖ్యం.ఫలితాలు కాదు, ప్రాణాలు ముఖ్యం.

# రాష్ట్ర గవర్నర్ నుకలిసిన డిజీపీ సీ.వి.అనంద్





**హైదరాబాద్,క్రైమ్ బ్యూరో, మే 02 (పీపుల్స్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్ అనంతరం రాష్ట్ర గవర్నర్ ను, డిప్యూటీ సీఎం ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

# ట్రాఫిక్ చలానాల నుండి తప్పించుకోవడానికి నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్: ఒకరి అరెస్ట్





**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 02 (పీపుల్స్ న్యూస్):** ట్రాఫిక్ చలానాలు చెల్లించకుండా తప్పించుకునేందుకు తన ద్విచక్ర వాహనం నంబర్ ప్లేట్‌ను మార్చిన (ట్యాంపరింగ్) వ్యక్తిని చార్మినార్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..... చిక్కడపల్లి, వివేక్ నగర్ కు చెందిన కొలిమి యాదయ్య (52) ఒక ప్రైవేట్ కార్యాలయంలో ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్నాడు మే 1వ తేదీన చార్మినార్ జోన్ టాస్క్ ఫోర్స్ బృందం గస్తీ నిర్వహిస్తుండగా, హోండా యాక్టివా వాహనంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న యాదయ్యను ఆపి తనిఖీ చేశారు. విచారణలో నిందితుడు తన వాహనంపై ఉన్న టీఎస్ 09 జీఎఫ్ 1079 అనే అసలు నంబర్‌ను, స్టిక్కర్ సాయంతో టిఎస్09జీఈ1079గా మార్చినట్లు గుర్తించారు. నిందితుడి వాహనంపై గతంలో 49 ట్రాఫిక్ చలానాలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి మొత్తం విలువ రూ. 20,815/-. ఈ భారీ మొత్తాన్ని చెల్లించకుండా పోలీసులను ప్రభుత్వ ఎన్ఫోర్స్మెంట్ విభాగాలను మోసం చేయాలనే ఉద్దేశంతోనే నిందితుడు నంబర్ ప్లేట్‌ను ట్యాంపరింగ్ చేసినట్లు పోలీసుల విచారణలో అంగీకరించాడు. ఈ ఘటనపై చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 141/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్ 318(4) ఎంవి యాక్ట్ సెక్షన్ 80(A) R/w 177 ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి వద్ద నుండి ట్యాంపరింగ్ చేసిన నంబర్ ప్లేట్ గల హోండా యాక్టివా వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును చార్మినార్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్. సైదాబాబు పర్యవేక్షణలో, ఎస్.ఐలు కె. స్వామి, కె. రామారావు, ఎం. మహేష్, ఎం. మధు, పి.సి. డి. రాఘవేందర్ రాజ్ , చిక్కడపల్లి పోలీసు బృందం సమర్థవంతంగా ఛేదించారు.

# అభివృద్ధి పనుల్లో ఎలాంటి అలసత్వం వహించకుండా తరితగతిన పనులను పూర్తి చేయాలి

**మాజీ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్**



**అడ్డగుట్ట, మే 02 (పీపుల్స్ న్యూస్) :** అభివృద్ధి పనుల్లో ఎలాంటి అలసత్వం వహించకుండా తరితగతిన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు మాజీ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్ సూచించారు. అడ్డగుట్ట సి సెక్షన్ లో జరుగుతున్న సిసి రోడ్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి మాజీ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సికింద్రాబాద్ ఎమ్మెల్యే తిగుళ్ల పద్మారావు గౌడ్ సహకారంతో డివిజన్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి సెక్షన్ మేనేజర్ చంద్రశేఖర్, బిఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, సత్తయ్య గౌడ్, దేవయ్య, అయోధ్య, నర్సింగ్, రామప్ప, విజయ, విమల, జిహెచ్ఎంసి అధికారులు పాల్గొన్నారు

# ప్రజల వద్దకే పాలన -- ప్రతి వినతికి న్యాయం చేస్తాం

**రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి.**






**ఖమ్మం /నేలకొండపల్లి/ మే 02/(పీపుల్స్ న్యూస్ ):**ప్రజల వద్దకే పాలన అందించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమం చేపట్టామని, ఇక్కడ ప్రజలు ఇచ్చిన ప్రతి వినతికి న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజాదర్బార్ లో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ బోదులబండ క్లస్టర్‌లో 12 గ్రామాలు ఉన్నాయని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగా లేకున్నా గత 2.4 సంవత్సరాలలో రేవంత్ రెడ్డి నాయకత్వం లో పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డు దారులకు సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలు ప్రారంభించామని తెలిపారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో ఇళ్లులు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే 4.5 లక్షల ఇళ్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఇళ్ల నిర్మాణానికి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామని తెలిపారు.విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ, డైట్ చార్జీలు 40 శాతం, కాస్మొటిక్ చార్జీలు 200 శాతం పెంచినట్లు తెలిపారు. ప్రభుత్వ పనితీరు వల్లే ప్రతి ఎన్నికల్లో ప్రజలు అధిక మెజారిటీతో గెలిపిస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు ఇది 5వ ప్రజాదర్బార్ సమావేశమని, ప్రతి సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులే అధికంగా వస్తున్నాయని పేర్కొన్నారు.గత ప్రభుత్వం ఇళ్లు ఇవ్వకపోవడం వల్లే ఇందిరమ్మ ఇళ్లకు ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని, తమ ప్రభుత్వం ఇళ్లు ఇవ్వడమే కాకుండా ప్రతి సోమవారం నిధులు విడుదల చేయడంతో ప్రజల్లో నమ్మకం పెరిగిందని తెలిపారు. మే నెలాఖరులో రెండవ దశ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు.పార్టీలకు అతీతంగా ప్రతి అర్హుడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, మూడవ, నాలుగవ దశల్లో కూడా ఇళ్లు మంజూరు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.భూమి సమస్యలపై ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొంటూ, గత ప్రభుత్వ ధరణి విధానం వల్ల అనేక సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. రాబోయే 2 నెలల్లో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. భూ భారతి ద్వారా అనేక సమస్యలు ఇప్పటికే పరిష్కరించామని, మిగిలిన వాటిని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, జిల్లా అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, వివిధగ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఒఆర్ఆర్ పై ప్రమాదాల నివారణకు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలి

**రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ సి వి ఆనంద్**





**హైదరాబాద్,క్రైమ్ బ్యూరో, మే 02 (పీపుల్స్ న్యూస్) :** ఔటర్ రింగ్ రోడ్డు పై ఇటీవల చోటుచేసుకుంటున్న వరుస ప్రమాదాల పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారని, ఈ ప్రమాదాల నివారణకు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించిన నేపథ్యంలో, రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ సి వి ఆనంద్ శనివారం ట్రాఫిక్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వాహనాల వేగాన్ని కచ్చితంగా నియంత్రించడంతో పాటు, భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి రాజీ పడకూడదని అధికారులకు డిజిపి స్పష్టం చేశారు. ముఖ్యంగా నగరంలో వాహనదారులకు, సామాన్య ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన దిశానిర్దేశం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్లు, డీసీపీలతో నిర్వహించిన ఈ సమావేశంలో నగరంలో నెలకొన్న ట్రాఫిక్ పరిస్థితులపై డిజిపి సివి ఆనంద్ కూలంకషంగా సమీక్షించారు. నగరంలో నానాటికీ పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు సరికొత్త వ్యూహాలను అవలంబించాలని, అవసరమైన చోట పటిష్టమైన నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే ‘ట్రాఫిక్ మేనేజ్మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో’ను ఏర్పాటు చేయనుందని, దీనికి సంబంధించిన కసరత్తు జరుగుతోందని ఆయన వెల్లడించారుఈ బ్యూరో అతి త్వరలోనే అందుబాటులోకి వచ్చి ట్రాఫిక్ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తుందని డిజిపి ఆశాభావం వ్యక్తం చేశారు.ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ఉక్కుపాదం మోపాలని, ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను , హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వారి పైన చట్టం ప్రకారం వ్యవహరించాలని, నిబంధనల అమలుపై క్షేత్రస్థాయిలో నిరంతరం తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ చందన దీప్తితో పాటు ట్రాఫిక్ డీసీపీలు రాహుల్ హెగ్డే, కాజల్ సింగ్, రాహుల్ రెడ్డి, అవినాష్ కుమార్, శేషాద్రిని రెడ్డి, శ్రీనివాస్ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే చట్టప్రకారం కఠిన చర్యలు

**సంతోష్ నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ ఆసిఫ్.**







**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో మే 02 (పీపుల్స్ న్యూస్) :** ఎవరైనా మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, వారిని జైలుకు పంపడం జరుగుతుందని సంతోష్ నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ ఆసిఫ్ పోలీస్ స్పష్టం చేశారు. జాయింట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్) , డి.సి.పి (ట్రాఫిక్) ఆదేశాల మేరకు, సంతోష్నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐఎస్ సదన్ జంక్షన్ , డిఎంఆర్ఎల్ జంక్షన్ల వద్ద పగటిపూట ఆకస్మిక డ్రంకెన్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రధానంగా వాటర్ ట్యాంకర్లు, స్కూల్ బస్సులు, స్కూల్ ఆటోలు , అంబులెన్స్ డ్రైవర్లపై ప్రత్యేక నిఘా ఉంచారు. విద్యార్థులు ,సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వాహనదారులను గుర్తించేందుకు ఈ చర్యలు చేపట్టారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు కేవలం రాత్రి సమయాల్లోనే కాకుండా, ఇప్పుడు నగరంలోని ప్రధాన కూడళ్లలో పగటిపూట కూడా డ్రంకెన్ డ్రైవింగ్ తనిఖీలను ముమ్మరం చేశారు. తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిని గౌరవప్రదమైన న్యాయస్థానం ముందు హాజరుపరుస్తున్నారు. నేరం నిరూపితమైన పక్షంలో న్యాయస్థానం నిందితులకు 2 రోజుల నుండి 15 రోజుల వరకు జైలు శిక్ష విధిస్తోందన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు డ్రంకెన్ డ్రైవింగ్ నిబంధనలను ఉల్లంఘించిన 27 మందిని కోర్టు ఆదేశాల మేరకు జైలుకు పంపడం జరిగిందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల మీ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు.

# భగత్ సింగ్ నగర్ లో ద్రవ్యాల వినియోగం వాటి దుష్ప్రభాలపై అవగాహన









**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో,మే 02 (పీపుల్స్ న్యూస్) :** జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ ప్రాంతంలో ద్రవ్యాల వినియోగంపై వాటి దుష్ప్రభాలపై శనివారం రాత్రి జీడిమెట్ల పోలీసులు కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీడిమెట్ల ఇన్స్పెక్టర్ గడ్డం మల్లేష్ కాలనీవాసులు యువతతో అవగాహన కల్పించడంతో పాటు ఆ ఏరియా నుండి నిర్మాణ ప్రాంతాల్ని ఆ కాలనీ ప్రజలతో కలిసి పూర్తి స్థాయిలో నడుచుకుంటూ తిరిగారు. అక్కడున్న యువతను అలాగే అక్కడ ఉన్నటువంటి వ్యక్తులకు భరోసా కలిగిస్తూ ఈ యొక్క ర్యాలీ దాదాపు రెండు గంటల పాటు సాగింది 350 మంది యువత యొక్క ర్యాలీలో పాల్గొన్నారు. ఇలాంటి ర్యాలీలు ఎక్కువగా నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండేట్లుగా ప్రజల ఆలోచనలకు అనుగుణంగా పోలీసింగ్ నిర్వహిస్తామని ఈ సందర్భంగా జీడిమెట్ల ఇన్స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెలియజేశారు.

# కాగజ్‌నగర్‌లో బాలాజీ ఆలయ నిర్మాణానికి భూమిపూజ



**కాగజ్‌నగర్** పట్టణంలోని ఆర్ఆర్ఓ క్యాంప్‌లో శ్రీ బాలాజీ ఆలయ నిర్మాణంలో భాగంగా ముందస్తుగా స్టోర్ రూమ్ మరియు మేస్త్రి సిబ్బంది నివాస గదుల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణ ఆశావా, జగదీష్ ఆశావా పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ నాయకు లు ఎమ్ఏజీ సంతోష్, సెల్ఫీ రవి తదితరులు హాజరయ్యారు. నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి



**వికారాబాద్ జిల్లా మే 3 పరిగి డివిజన్:** పూడూరు మండలం రాకంచెర్ల గ్రామం లో నిర్వహించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవంలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారి కళ్యాణాన్ని భక్తిశ్రద్ధల తో వీక్షించిన ఎమ్మెల్యే గారు, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యే గారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పరిగి ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వికారాబాద్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు రఘునాథరెడ్డి గూడూరు మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు యువజన నాయకులు భక్తులు పాల్గొన్నారు.

# కార్మికులకు అపార అవకాశాలు



**అమరావతి, మే 2:** ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ కార్మికుడిలా శ్రమిస్తూ కార్మికుల భద్రత, సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని మంత్రి వాసంశెట్టి శుభాశ్ అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసే లేబర్ అడ్డా నిర్మాణాలు.. అందరికీ పని దొరికేలా చూడటంతో పాటు నైపుణ్య శిక్షణా కేంద్రాలుగానూ మారతాయన్నారు. అమరావతి, పోలవరం సహా వివిధ పెట్టుబడుల నిర్మాణాలకు సంబంధించి కార్మికులకు అపార అవకాశాలు రాష్ట్రంలోనే ఉన్నందున దానిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వైసీపీ ప్రభుత్వం 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల జీవితాలను చిన్నాభిన్నం చేసిందని మంత్రి విమర్శించారు. ఇసుకను బంగారం చేసి, ఒక ఇటుక కూడా పేర్చక పోగా కార్మికుల భద్రత విషయంలో ఏ మాత్రం చిత్తశుద్ధి లేనట్లుగా గత ప్రభుత్వం వ్యవహరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పోచమ్మ తల్లి ఆలయ పనులపై ఎమ్మెల్సీ దండె విఠల్ సానుకూల స్పందన

**పెంచికల్ పేట్ ,:** కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్సీ దండె విఠల్ నివాసంలో పెంచికల్ పేట్ మండలం లోనీ కోయచిచ్చల గ్రామస్తులు MLC మర్యాదపూర్వకంగా కలిశారు. తమ గ్రామంలో నిర్మాణ దశలో ఆగిపోయిన పోచమ్మ తల్లి ఆలయ పనుల గురించి, అలాగే త్వరలో చేపట్టబోయే విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం గురించి వారు ఎమ్మెల్సీకి సవివరంగా తెలియజేశారు. గత కొంతకాలంగా నిలిచిపోయిన ఆలయ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు, ప్రతిష్టాపన మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని గ్రామస్తులు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండె విఠల్‌ను కోరారు.

**సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ :**

గ్రామస్తుల విన్నపాన్ని ఓపికగా విన్న ఎమ్మెల్సీ దండె విఠల్ వారి అభ్యర్థన పట్ల సానుకూలంగా స్పందించారు. పోచమ్మ తల్లి ఆలయ పనులను పునఃప్రారంభించి త్వరగా పూర్తి చేయడానికి, మరియు ప్రతిష్టాపన కార్యక్రమాన్ని దిగ్విజయంగా



జరిపించడానికి తన వంతు సంపూర్ణ మద్దతు, ఆర్థిక సహకారం అందిస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో పెంచికల్ పేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సముద్రాల రాజన్న మరియు పెంచికల్పేట్ మండల నాయకులు రాచకొండ కృష్ణా, భక్తు సంతోష్, జాడి మల్లేష్, జాడి రాజేశ్వర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు

# ఇటిక్యాల లో వచ్చే మంగళవారం జరిగే హిందూ సమ్మేళనం కరపత్రం ఆవిష్కరణ...

**ఇటిక్యాల** హిందూ సమ్మేళన సమితి ఇటిక్యాల శాఖ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం కరపత్రం గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, విడిసి చైర్మన్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ లు, మాజీ ప్రజాప్రతి నిధులు, హిందూబంధువులు, ప్రజలు, హిందూ సమ్మేళన సమితి బాధ్యులు ఆవిష్కరించారు.

ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఇటిక్యాల గడి ఆవరణలో మే-5 మంగవవారం సాయంత్రం 06.00 గంటల నుండి రాత్రి 09.00 గంటల వరకు ఆధ్యాత్మిక మహోత్సవం కార్యక్రమం జరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇంటింటి నుండి ప్రతీ మహిళామూర్తిమంగళహారతులతో రావాలని మంగళహారతులతో వచ్చిన వారికి శ్రీగోమాతా ప్రతిమలు అందజేసి వేదపండితుల చేత గోపూజ చేయించడం జరుగుతుందని, భజన, సామూహిక శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం వుంటుందని ఈ కార్యక్రమాలలో పాల్గొనే వారి



యొక్క సకల గ్రహదోషాలు, భూతప్రేత పిశాచాలు, నరదిష్టి తొలగిపోయి సర్వసంకల్పాలు నెరవేరుతాయని అన్నారు. శ్రీశ్రీశ్రీ జగన్నాథ విష్ణువర్ధనాచార్యులు ఉభయ వేదాంత పండితులు గారిచే అనుగ్రహ భాషణం ఉంటుందని, ప్రధాన వక్త డాక్టర్ సాయిమధూకర్ జిల్లా సహ కార్యవాహ్ బౌద్ధిక్ వుంటుందని అన్నారు. వచ్చే మంగవవారం రోజున అందరు తమ తమ ఇండ్లలో అలుకుచల్లుకుని మహిళలు మంగళహారతులతో రావాలని అన్నారు.

# ఏపీ లిక్కర్ స్కామ్.. రంగంలోకి ఐటీ.. రూ.2000 కోట్లపై ఫోకస్



**అమరావతి, మే 2:** ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఐటీ అధికారులు రంగంలోకి దిగారు. లిక్కర్ స్కామ్ ద్వారా సుమారు రెండు వేల కోట్ల రూపాయల అక్రమ సంపాదనపై ఐటీ ఫోకస్ పెట్టింది. రూ.2000 కోట్లకు సంబంధించిన ట్యాక్స్ వివరాలను ఐటీ సేకరించే పనిలో పడింది. త్వరలోనే పలువురు నిందితులకు నోటీసులు జారీ చేయనున్నట్లు సమాచారం. అక్రమంగా సంపాదించిన డబ్బును ఒకచోట నుంచి మరోచోటికి తరలించడానికి హవాలా మార్గాన్ని ఎంచుకున్నట్లు ఐటీ అధికారులు అనుమానిస్తున్నారు. డబ్బు తరలింపు విధానంపై ఐటీ బృందం ప్రత్యేక దృష్టి సారించింది. హవాలా ద్వారా నిధులను దుబాయ్‌కు తరలించినట్లు ఐటీ గుర్తించింది. నెలకు 50 నుంచి 60 కోట్ల రూపాయల అక్రమ నగదు జనరేట్ చేసినట్లు దర్యాప్తులో బయటపడింది. డిస్టిలరీల నుంచి వెండర్లకు ఐదు రెట్లు ఎక్కువ చెల్లింపులు చేసినట్లు గుర్తించింది. ఎలాంటి మెటీరియల్ సరఫరా చేయకుండానే రెండు డిస్టిలరీలు ఫేక్ ఇన్‌వాయిస్‌లు సృష్టించి 76.92 కోట్ల రూపాయలను తరలించినట్లు దర్యాప్తులో బయటపడింది. డిజిటల్ ట్రైల్‌ను తప్పించుకోవడానికే మొత్తం లాభాలను బ్లాక్ మనీగా దాచిపెట్టినట్లు ఐటీ గుర్తించింది.

# టీడీపీ సీనియర్ నేత వల్లభనేని బాబురావు కన్నుమూత

**కృష్ణాజిల్లా గుడివాడ, మే2 ():** రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఉమ్మడి కృష్ణాజిల్లా తెలుగు దేశం పార్టీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ నేత వల్లభనేని బాబు రావు తుదిశ్వాస విడిచారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు లోని తన స్వగృహంలో కన్నుమూ శారు. గత కొంతకాలంగా ఆయన వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. బాబురావు టీడీపీ వ్యవస్థాపక కాలం నుంచి పార్టీలో క్రియాశీలక నేతగా పనిచేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం ఆయన సేవలంది ంచారు. ఆయన మృతి వార్త తెలియగానే కృష్ణా జిల్లాకు చెందిన కూటమి నేతలు (టీడీపీ, జనసేన, బీజేపీ), కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆయన స్వగృహానికి చేరుకున్నారు. బాబురావు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన



మరణం జిల్లా రాజకీయాలకు, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీకి తీరని లోటని నేతలు పేర్కొన్నారు. వల్లభనేని బాబురావు మృతిపై పలువురు రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# చిన్నారులకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 02 (పీపుల్స్ న్యూస్) :** హైదరాబాద్ సిటీ పోలీస్ చేపట్టిన సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా, చిన్నారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచడానికి , పోలీసులకు, ప్రజలకు మధ్య దూరాన్ని తగ్గించడానికి హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. హోండా మోటార్ సైకిల్స్ అండ్ స్కూటర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో గోషామహల్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో చిన్నారుల కోసం ఉచిత వేసవి శిక్షణ నిర్వహించారు. ఈ శిబిరాన్ని మే 11, 2026 నుండి మే 16, 2026 వరకు ప్రతిరోజూ ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. ఈ శిక్షణలో భాగంగా చిన్నారులకు ట్రాఫిక్ అవగాహన , రోడ్డు భద్రతతో పాటు ఆత్మరక్షణ , డ్యాన్స్ ఢ మ్యూజిక్, పెయింటింగ్ ఢ కార్టూనింగ్, చేతిరాత మెరుగుపరచుకోవడం , వ్యక్తిత్వ వికాసం , ప్రాథమిక అత్యవసర వైద్య చికిత్స వంటి విభిన్న అంశాలపై నిపుణులచే శిక్షణ ఇవ్వబడుతుంది. 6వ తరగతి పూర్తి చేసిన విద్యార్థుల నుండి 10వ తరగతి చదువుతున్న బాలబాలికల వరకు అందరూ ఈ శిబిరంలో చేరడానికి అర్హులు. ఈ శిబిరానికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు మే 3, 2026 నుండి ప్రారంభమవుతాయి. సీట్లు పరిమితంగా ఉన్నందున ఆసక్తి గల వారు వెంటనే సంప్రదించగలరు. ఈ కార్యక్రమానికి సంబంధించి మరిన్ని వివరాల కోసం గోషామహల్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ జి. హరీష్ ని (సెల్: 8712660655) లేదా కార్యాలయ అసిస్టెంట్‌ను (నంబర్: 9848063345) సంప్రదించవచ్చునని తెలిపారు. శిబిరానికి వచ్చే చిన్నారులకు రవాణా సౌకర్యాన్ని తల్లిదండ్రులే స్వయంగా ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని పోలీసులు స్పష్టం చేశారు.

# ఎస్ ఆర్ ఐ సర్వేకు ప్రజలు పూర్తిగా సహకరించాలి

**మాజీ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్.**






**అడ్డగుట్ట, మే 02 (పీపుల్స్ న్యూస్) :** ఎస్ ఆర్ ఐ సర్వేకు ప్రజలు పూర్తిగా సహకరించాలని మాజీ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్ అన్నారు. అడ్డగుట్ట ఏ సెక్షన్ లోని రెండు పులుల దర్గా వద్ద సికింద్రాబాద్ ఎమ్మెల్యే తిగుళ్ల పద్మారావు గౌడ్ ఆదేశాల మేరకు నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఆర్ ఐ) కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి ఆమె ప్రజలకు ఎస్ఆర్ఐ పై అవగాహనను కల్పించారు. అనంతరం మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలు, బిఆర్ఎస్ నాయకులు ఓటర్ల లిస్టు నుండి ప్రజల పేర్లను తొలగించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, నక్కమధు, సత్తయ్య గౌడ్, నర్సింగ్, అయోధ్య, మోహన్ , దేవయ్య, రామప్ప, రాజు, మహేందర్, భాగ్య, సుజాత, పాల్గొన్నారు.

# ఓట్ల తారుమారుపై టీఎంసీ ఆరోపణ- అదంతా రాజకీయ డ్రామానే



**బంగాల్:** బంగాల్‌లో ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌లపై తృణమూల్ కాంగ్రెస్ చేసిన ఆరోపణలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. అధికార టీఎంసీ చేసిన ఆరోపణలను ఆ రాష్ట్ర ప్రతిపక్ష నేత, బీజేపీ సీనియర్ నాయకుడు సువేందు అధికారి తీవ్రంగా ఖండించారు. ఇవన్నీ రాజకీయ డ్రామా మాత్రమేనని, ప్రచారం కోసం టీఎంసీ చేస్తున్న ప్రయత్నమని ఆయన విమర్శించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన సువేందు అధికారి, టీఎంసీకి ప్రజల్లో మద్దతు తగ్గిపోయిందని, వచ్చే రోజుల్లో ఆ పార్టీ అధికారాన్ని కోల్పోతుందని అన్నారు. "ఇది అంతా డ్రామా మాత్రమే. ఇందులో ఎలాంటి వాస్తవం లేదు. కేవలం ప్రచారం కోసం ఈ ఆరోపణలు చేస్తున్నారు. వీటికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎన్నికల్లో టీఎంసీ ఓటమి దిశగా వెళ్తోంది. వాళ్లు రాజకీయాలను వృత్తిగా మార్చుకున్నారు. అధికారంలో లేకపోతే పూర్తిగా కూలిపోతారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కావాల్సిన సీట్ల కంటే ఎక్కువ స్థానాలు మేము గెలుస్తాం" అని సువేందు అధికారి తెలిపారు. రాష్ట్రంలోని 15 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్?ను ఆయన స్వాగతించారు. అయితే ఫల్తా అసెంబ్లీ నియోజకవర్గం మొత్తంలో కూడా జరగాలని తాను ఆశిస్తున్నట్లు చెప్పారు. "మగ్రాహట్ వెస్ట్‌లో జరిగిన దాన్ని స్వాగతిస్తున్నాం. డైమండ్ హార్బర్‌లో మరిన్ని బూత్‌లలో, అలాగే ఫల్తా సెగ్మెంట్ మొత్తంలో కనీసం 60 బూత్‌లలో రీ-పోలింగ్ జరగాల్సింది" అని తెలిపారు. దక్షిణ 24 పరగణాల జిల్లాలోని ఫల్తా నియోజకవర్గంలోని కొన్ని పోలింగ్ బూత్‌లలో బీజేపీ సింబల్ తామరపువ్వును టేప్‌తో కప్పివేశారని ఆరోపించారు. "వారు (ఈసీఐ) ఏదో ఆలోచిస్తున్నారు, వారికి ఒక పద్ధతి ఉంది. పరిశీలకుడి నివేదిక, ప్రిసైడింగ్ ఆఫీసర్ హ్యాండ్‌బుక్, సీసీటీవీ ఫుటేజ్ వంటి వాటితో వారికి ఒక వ్యవస్థ ఉంది, దానితో వారు ఆ పని చేస్తున్నారు. నేను ఎన్నికల సంఘాన్ని గౌరవిస్తాను, మమతా బెనర్జీ గౌరవించినంతగా కాదు" అంటూ విమర్శించారు. ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌ల విషయంలో టీఎంసీ తీవ్ర ఆరోపణలుమరోవైపు, ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌ల విషయంలో టీఎంసీ తీవ్ర ఆరోపణలు చేసింది. బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కై సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధులు లేకుండానే బ్యాలెట్ బాక్సులు తెరిచారని ఆరోపించింది. ఇది బహిరంగంగా ప్రజాస్వామ్య హత్యేనని టీఎంసీ వ్యాఖ్యానించింది. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో టీఎంసీ ఓ వీడియోను కూడా పోస్టు చేసింది. ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ గదులను అనుమానాస్పదం గా తెరిచినట్లు ఆరోపిస్తూ, ఇది భారీ ఎన్నికల మోసానికి సంకేతమని పేర్కొంది. టీఎంసీ ఆరోపణలను ఖండించిన బంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి అయితే టీఎంసీ ఆరోపణలను బంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ కుమార్ అగర్వాల్ ఖండించారు. ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌లు పూర్తిగా భద్రంగా ఉన్నాయని, ఇందులో ఎలాంటి వివాదం లేదని స్పష్టం చేశారు. "ఎక్కడా సీసీటీవీలు ఆపలేదు. మొత్తం ఎనిమిది స్ట్రాంగ్‌రూమ్‌లకు సంబంధించిన ప్రత్యక్ష దృశ్యాలు ప్రసారం అవుతున్నాయి. అందులో ఏడూ ఈవీఎంలకు, ఒకటి పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించినవి. మూడు అంచెల భద్రత కల్పించాం. రాజకీయ పార్టీల ప్రతినిధులు బయట కూర్చొని అన్ని చూడొచ్చు" అని అగర్వాల్ పేర్కొన్నారు. ఇక, సాయంత్రం నాలుగు గంటల సమయంలో పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్‌రూమ్‌ను నిబంధనల ప్రకారం తెరిచామని, దీనిపై అన్ని రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు ముందుగానే సమాచారం ఇచ్చామని అగర్వాల్ చెప్పారు. రిటర్నింగ్ ఆఫీసర్ ద్వారా సమాచారం పంపించామని పేర్కొన్నారు. అలాగే, రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య లేదని కూడా ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఇలాంటి ఆరోపణలు సహజమని, కౌంటింగ్ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరుగుతుందని చెప్పారు. ఎన్నికలు ఎలా అయితే, ప్రశాంతంగా జరిగాయో, ఓట్ల లెక్కింపూ అలాగే జరుగుతుందని స్పష్టం చేశారు. కాగా, ఇటీవలే బంగాల్‌లో రెండో దశ పోలింగ్ ముగిసింది. అందులో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 92.67 శాతం పోలింగ్ నమోదైంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధం మరింత ముదురుతోంది. మరోవైపు, ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది. దీంతో గెలుపెవరన్న విషయంపై ఉత్కంఠ నెలకొంది.

# బీజేపీలో చేరిన ఆప్ రాజ్యసభ ఎంపీ అరెస్ట్‌కు రంగం సిద్ధం




**న్యూఢిల్లీ:** ఇటీవల బీజేపీలో చేరిన ఆమ్ ఆద్మీ పార్టీ ( ఆప్ ) రాజ్యసభ సభ్యుడు సందీప్ పాఠక్‌పై పంజాబ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యా యి. ఆయనపై నాన్-బెయిల్‌బుల్ కేసు నమో దైన నేపథ్యంలో అరెస్టును ఎదుర్కొనే అవకాశం ఉంది. దీంతో అరెస్ట్ నుంచి తప్పించుకోడానికి ఆయన శనివారం న్యూఢిల్లీలోని తన అధికారిక నివాసం నుంచి ఆయన బయటకు వెళ్లినట్టు నివేదికలు చెబుతున్నాయి. అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్‌ను వీడి, బీజేపీలో చేరిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలలో పాఠక్ కూడా ఒకరు. ఎంపీ పాఠక్ అధికారిక నివాసం వెలుపల భద్రతను పెంచుతున్న దృశ్యాలు, ఆయన ఇంటి వెనుక ద్వారం నుంచి బయటకు వచ్చి కారులో కూర్చోవడం, ఆపై వెళ్లిపోతున్న వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి, రహస్య ప్రదేశానికి వెళ్లిపోయా రని, కేసులో ఎంపీకి ఉపశమనం కల్పించేం దుకు బీజేపీ తన లీగల్ టీమ్‌ను రంగంలోకి దించుతోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే, ఆయనపై ఎందుకు కేసు నమోదయ్యి యరాలేదు. ఆప్ తన సూత్రాలు, విలువలు, మౌలిక నైతికత నుంచి పక్కకు తప్పుకుందని ఆరోపిస్తూ.. రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్, క్రికెటర్ హర్భజన్ సింగ్, రాజిందర్ గుప్తా, స్వాతి మాలివాల్, విక్రమ్‌జిత్ సాహ్నీలు ఏప్రిల్ 24న పార్టీ నుంచి నిష్క్రమిస్తున్నట్లు ప్రకటించారు. మాలివాల్ మినహా మిగతా ఆరుగురు పంజాబ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆప్‌కు చెందిన మొత్తం 10 మంది రాజ్యసభ ఎంపీలలో మూడింట రెండొంతుల మంది పార్టీ మారడంతో ఫిరాయింపుల నిరోధక చట్టం రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం వారిలో ఎవరూ అనర్హతకు గురయ్యే అవకాశం లేదు. దీనిపై మే 5న రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుస్తున్నట్టు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రకటించారు. ఇలాంటి చర్యలు ప్రజా తీర్పుకు ద్రోహం చేయడమే అని ఆయన నొక్కి చెప్పారు. ఆప్ నుంచి రాజ్యసభ ఎంపీలు వైదొలగడంతో పంజాబ్ అసెంబ్లీలో మాన్ అవిశ్వాస తీర్మానం ఎదుర్కొన్నారు. మే దే రోజున ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశం సందర్భంగా తీర్మానం పెట్టగా.. మాన్ నెగ్గారు. మొత్తం 117 మంది సభ్యులున్న పంజాబ్‌లో ఆప్‌కి 94 మంది, కాంగ్రెస్‌కు 16, శిరోమణి అకాలీదళ్‌కు మూడు, బీఎస్పీకి ఒకరు, బీజేపీకి ఎమ్మెల్యేలు, ఒక స్వతంత్ర ఎమ్మెల్యే ఉన్నారు.

# అస్సాంలో హోటల్ పాలిటిక్స్ సంకేతాలు.. రంగంలోకి కాంగ్రెస్ పార్టీ ట్రబుల్ మేకర్ డీకే



**గువాహటి:** అస్సాం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మే 4న వెలువడనుండటంతో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు పార్టీ ట్రబుల్ షూటర్‌గా పేరున్న కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ను రంగంలోకి దింపింది. ఆయనతో పాటు, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ ఎన్నికల కౌంటింగ్‌కు ముందే పార్టీ అభ్యర్థులను కలుసుకునేందుకు అసోం చేరుకున్నారు. పార్టీ ఎమ్మెల్యేలు ఫిరాయింపుల బారిన పడకుండా వారిని కాపాడుకునేందుకు ఇక్కడకు వచ్చినట్టు గువాహటిలో శనివారంనాడు మీడియాతో మాట్లాడుతూ డీకే చెప్పారు. 'మా ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు ఇక్కడకు వచ్చాను. ఎమ్మెల్యేలకు మార్గదర్శకం చేసి పార్టీకి వెన్నుద న్నుగా ఉంటాను. ఎమ్మెల్యేలను కాపాడుకుంటాం' అని డీకే శివకుమార్ చెప్పారు. ఫిరాయింపుల నుంచి పార్టీ ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు 'హోటల్ పాలిటిక్స్' నడపడంలో డీకే సమర్థుడనే పేరుంది. 'ఇండియా' కూటమిదే ప్రభుత్వంఎగ్జిట్ పోల్స్ ఫలితాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నా, లేకున్నా వాటిని తాను నమ్మనని, తన అంచనాలు తనకు ఉన్నాయని చెప్పారు. ఎన్నికలు జరిగిన ప్రతి రాష్ట్రంలోనూ 'ఇండియా' కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. కాంగ్రెస్ కూటమి అధికారంలోకి వస్తుందని పార్టీ కార్యకర్తలు కూడా ధీమాగా ఉన్నారని చెప్పారు. పార్టీ నాయకులపైన, అస్సాం ఓటర్లపైనా తనకు నమ్మకం ఉందన్నారు. ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, అది సాకారం అవుతుందని చెప్పారు. కాగా, రాష్ట్ర నాయకత్వం, పార్టీ అభ్యర్థులతో తాను, డీకే శివకుమార్ ఈరోజు సమావేశమవుతున్నట్టు భూపేష్ బఘేల్ తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ అనేవి కాపీ-పేస్ట్ వ్యవహారమని, ఎన్నడూ నిజం కావని అభిప్రాయం వ్యక్తం చేశారు. అస్సాంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే వరుసగా మూడోసారి కూడా అధికారాన్ని నిలబెట్టుకుంటుందని ఎగ్జిట్ పోల్స్ జోస్యం చెప్పాయి. 126 సీట్లలో ఎన్డీయే 88 నుంచి 100 సీట్లు గెలుచుకుంటుందని, కాంగ్రెస్‌కు 24-36 సీట్లు వస్తాయని 'యాక్సిస్ మై ఇండియా' జోస్యం చెప్పింది.

# 'ఓట్ల లెక్కింపు విషయంలో ఈసీ నిర్ణయమే ఫైనల్'- మమతా సర్కార్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు



**బంగాల్:** బంగాల్ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కేవలం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులనే నియమించారని టీఎంసీ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఎన్నికల సంఘం నిర్ణయం నిబంధనలకు విరుద్ధంగా లేదని అభిప్రాయపడింది. కేవలం కేంద్రప్రభుత్వ పూల్ నుంచే సిబ్బందిని ఎంచుకునే అధికారం ఈసీకి ఉందని సుప్రీం తెలిపింది. ఓట్ల లెక్కింపు సమయంలో టీఎంసీ ప్రతినిధులు కూడా ఉంటారు కాబట్టి ఆందోళన అవసరం లేదని పేర్కొంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర ప్రభుత్వ సిబ్బందిని నియమించాలన్న ఈసీ నిర్ణయాన్ని టీఎంసీ అంతకుముందు కలకత్తా హైకోర్టులో సవాల్ చేసింది. వారిని సూపర్‌వైజర్లుగా, అసిస్టెంట్లుగా నియమిస్తే బీజేపీకి అనుకూలంగా పనిచేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. అయితే ఈసీ నిర్ణయాన్ని హైకోర్టు సమర్థిం చడంతో టీఎంసీ సుప్రీంను ఆశ్రయించింది. ప్రతి టేబుల్ వద్ద మైక్రో అబ్జర్వర్లుగా కేంద్ర అధికారులు ఉన్నా, మళ్లీ అదనంగా కేంద్ర సిబ్బందే ఎందుకని ప్రశ్నించింది. ఈసీ సర్క్యులర్ ప్రకారం రాష్ట్ర అధికారులను చేర్చుకోవాల్సి ఉన్నా, వారిని నియమించడం లేదని ఆరోపించింది. ఈ సమయంలో ఎన్నికల కమిషన్ న్యాయవా దులు స్పందించారు. ఓట్ల లెక్కింపుపై పూర్తి పర్యవేక్షణ అధికారం రిటర్నింగ్ అధికారికే ఉంటుందని, ఆయన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి అని గుర్తుచేశారు. కాబట్టి టీఎంసీకి అనుమానం అవసరం లేదని ఈసీ కోర్టుకు తెలిపింది. ఇరు పక్షాల వాదనలు విన్న సుప్రీం, ఈసీతో ఏకీభవించింది. 'ఓట్ల లెక్కింపు సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారు' ఈ సందర్భంగా, ఎన్నికల సంఘం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది డీ.ఎస్. నాయుడు, రిటర్నింగ్ అధికారి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి అని, ప్రభుత్వ ఉద్యోగులను ఏ విభాగం నుంచైనా సిబ్బందిని నియమించే అధికారం ఆయనకు ఉంటుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారని చెప్పారు. ప్రతి అభ్యర్థికి వారి స్వంత కౌంటింగ్ ఏజెంట్ కూడా ఉంటారని తెలిపారు. అలాగే, టీఎంసీ ఆందోళనలు నిరాధారమైనవని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సిబ్బందికి బదులుగా కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) ఉద్యోగుల నుంచి లెక్కింపు ఏ, సహాయకులను నియమించాలన్న ఈసీ నిర్ణయంలో ఎలాంటి చట్టవిరుద్ధత లేదని పేర్కొంటూ టీఎంసీ పిటిషన్ దాఖలు చేసింది. అయితే, ఆ పిటిషన్‌ను ఏప్రిల్ 30న కోల్?కతా హైకోర్టు కొట్టివేసింది. దీంతో మమత సుప్రీం ఆశ్రయించిన నేపథ్యంలో న్యాయస్థానం ఈ విధంగా స్పందించింది. మమతకు న్యాయపరమైన దెబ్బ! మరోవైపు, మమతా దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చడంపై బీజేపీ స్పందించింది. కోర్టు నిర్ణయం మమతా బెనర్జీకి న్యాయపరమైన ఎదురుదెబ్బ అని బీజేపీ సీనియర్ నాయకుడు అమిత్ మాల్వీయా పేర్కొన్నారు. అయితే, మాల్వీయా వ్యాఖ్యలపై టీఎంసీ నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు. మే 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ-వేడెక్కిన రాష్ట్ర రాజకీయాలుకాగా, 294 అసెంబ్లీ స్థానాలకు గానూ బంగాల్ అసెంబ్లీకి ఏప్రిల్ 23, ఏప్రిల్ 29 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరిగింది. అయితే, మే 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ఈ క్రమంలో మరో కీలక పరిణామం జరిగింది. అయితే, బంగాల్?లోని రెండు నియోజక వర్గాల్లో ఎన్నికల అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో మళ్లీ ఎన్నికలు (రీపోలింగ్?) నిర్వహించారు ఈసీ అధికారులు. మగ్రాహా? పశ్చిమ్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 11 పోలింగ్ కేంద్రాల్లో, డైమండ్ హార్బర్‌లోని 4 బూత్?ల్లో రీపోలింగ్ నిర్వహించారు.

# ఇరాన్‌తో యుద్ధం ముగిసిందన్న వైట్‌హౌస్ కాంగ్రెస్ అనుమతి అవసరం లేదంటూ ట్రంప్ వాదన



**అమెరికా:** ఇరాన్‌తో యుద్ధం పై అమెరికా కీలక ప్రకటన చేసింది.. ఇరాన్‌తో యుద్ధం ఆపేసినట్లు వైట్ హౌస్ కాంగ్రెస్‌కు తెలిపింది. ఏప్రిల్‌లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంతోనే యుద్ధం ముగిసినట్లు ప్రకటించింది. 60 రోజుల గడువు (వార్ పవర్స్ యాక్ట్ ప్రకారం) మే 1తో ముగియడంతో ప్రకటన చేశారు. గత నెలలో కాల్పుల విరమణ అమల్లోకి వచ్చినప్పటి నుంచి దాడులు జరగలేదని.. ఇరాన్‌తో ముప్పు తొలగిపోలేదంటున్నారు ట్రంప్. ఆ దేశ నాయకత్వం గందరగోళంలో ఉందని.. తాము దాడులు ఆపినంత మాత్రాన.. యుద్ధం ముగిసినట్లు కాదన్నారు. ఇరాన్ కొత్త ప్రతిపాదనను పంపిందని.. కానీ తాను ఆ ప్రతిపాదనతో సంతృప్తిగా లేనని.. ఏం జరుగుతుందో చూద్దామన్నారు. ఇరాన్‌తో యుద్ధానికి అనుమతి పొందాల్సిన అవసరం లేకుండా అమెరికా జాగ్రత్త పడింది. ఇరాన్‌పై తాము చేస్తున్నది యు ద్ధమే కాదంటున్నారు అధ్యక్షుడు ట్రంప్. యుద్ధంపై 60 రోజుల్లోగా కాంగ్రెస్ అనుమతి తీసుకోవాలని చెప్పడం చట్ట విరుద్ధమని అమెరికా అధ్యక్షుడి వాదన. సెనెట్‌లో విచారణకు హాజరైన అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్.. ఇరాన్‌పై అమెరికా సైనిక చర్య 60 రోజులకు మించి కొనసాగలేదన్నారు. అందుకే 1973 నాటి చట్టానికి అనుగుణంగా ఆ యుద్ధానికి కాంగ్రెస్ అనుమతి పొందాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. 60రోజుల్లోగా చట్టసభ ఆమోదం పొందాలన్న నిబంధన ప్రస్తుతానికి వర్తించదన్నారు. 1973 చట్టం ప్రకారం అమెరికా ఏదైనా దేశంపై సైనిక చర్యకు దిగితే 60 రోజుల్లోగా అమెరికా చట్టసభ కాంగ్రెస్ అనుమతి తీసుకోవాలి.. లేకపోతే యుద్ధం ఆపేయాలన్న నిబంధ ఉంది. వాస్తవానికి అమెరికా ఫిబ్రవరి 28న ఇరాన్‌పై యుద్ధం ప్రారంభించగా.. చట్టసభ కాంగ్రెస్‌కు మార్చి 2న అధికారికంగా సమాచారం ఇచ్చింది. ఈ క్రమంలో శుక్రవారంతో 60 రోజులు పూర్తవుతోంది. అయితే ఇరాన్‌పై చేప ట్టిన సైనిక చర్య గడువుకు మించి కొనసా గలేదని.. అందుకే కాంగ్రెస్ అనుమతి అవసరం లేదనేది ట్రంప్ వాదన. ప్రతిపక్ష డెమోక్రాట్లు 60 రోజుల అనుమతి వాదన చేస్తున్నారని.. వాళ్లసలు దేశ భక్తులే కాదని ట్రంప్ ఘాటుగా స్పందించారు. ఇదిలా ఉంటే అమెరికా అధ్యక్షు డు ట్రంప్ ఈయూపై మరోసారి సుంకాల మోత మోగించారు. అమెరికాతో ఈయూ కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈయూ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే కార్లు, ట్రక్కులపై సుంకాన్ని 25 శాతానికి పెంచుతు న్నట్లు ప్రకటించారు. అమెరికా తీసుకున్న నిర్ణయంతో ఆయా దేశాల్లో ఆటోమొబైల్ రంగంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని చెబుతున్నారు. అమెరికా ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే ఎవరికైనా ఇలాంటి చర్యలు తప్పవని ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు.

# ఐఐటీ జోధ్‌పూర్‌లో తాగునీటి సమస్య.. వాటర్ ట్యాంకర్ వద్ద క్యూ కట్టిన విద్యార్థులు





**జైపూర్:** ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ఐఐటీ జోధపూర్‌లో తాగునీటి సమస్య కొరత ఏర్పడింది. దీంతో క్యాంపస్‌కు వాటర్ ట్యాంకర్ తెప్పించారు. ఈ నేపథ్యంలో నీటిని పట్టుకునేందుకు విద్యార్థులు క్యూకట్టారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. జాతీయ ప్రాముఖ్యత కలిగిన రాజస్థాన్‌లోని ఐఐటీ జోధ్‌పూర్‌లో తాగునీరు వంటి ప్రాథమిక సౌకర్యాల పరంగా పలు సమస్యలున్నాయి. ఈ నేపథ్యంలో చదువు, పరిశోధనలపై దృష్టి పెట్టాల్సిన విద్యార్థులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీటి కొరత నేపథ్యంలో వాటర్ ట్యాంకర్ నుంచి నీటిని పట్టుకునేందుకు పోటీపడ్డారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కాగా, ఐఐటీ జోధ్‌పూర్ డైరెక్టర్ అవినాష్ కుమార్ అగర్వాల్ దీనిపై స్పందించారు. రాజస్థాన్‌లో శుభ్రమైన నీటి సరఫరా లేని ఏకైక కేంద్ర సంస్థ ఐఐటీ జోధ్‌పూర్ మాత్రమే అని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నీటి సరఫరా జరుగుతున్నట్లు చెప్పారు. అయితే వోల్టేజ్ హెచ్చుతగ్గుల కారణంగా పంపింగ్ స్టేషన్‌లోని మోటార్ దెబ్బతినడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని అన్నారు. మరోవైపు సిబ్బంది 30 గంటలు శ్రమించారని, నీటి సరఫరాను పునరుద్ధరించారని ఐఐటీ జోధ్‌పూర్ డైరెక్టర్ వివరించారు. నీటి సరఫరా అంతరాయం సమ యంలో సుర్‌పురా గ్రామం నుంచి వాటర్ ఏర్పాటు చేసుకోవాల్సి వస్తున్నదని వాపోయారు..

# ఊరేగింపుగా పెళ్లికి వెళ్తున్న వరుడు.. కాల్పులు జరిపి హత్య

**లక్నో:** ఒక వరుడు తన బంధువులతో కలిసి ఊరేగింపుగా పెళ్లి వేదిక వద్దకు బయలుదేరాడు. మార్గమధ్యలో కొందరు వ్యక్తులు అతడిపై కాల్పులు జరిపి పారిపోయారు. బుల్లెట్ గాయాలైన వరుడు కారులోనే కుప్పకూలి మరణించాడు. ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బదౌర్ గ్రామానికి చెందిన 27 ఏళ్ల ఆజాద్ బింద్ శుక్రవారం పెళ్లికొడుకుగా ముస్తాబయ్యాడు. తన బంధువులతో కలిసి ఊరేగింపుగా కారులో పెళ్లి వేదిక వద్దకు బయలుదేరాడు. కాగా, శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో ముఖానికి ముసుగులు ధరించిన వ్యక్తులు బైక్‌పై వచ్చారు. వరుడు ఉన్న కారును అడ్డగించారు. ఆజాద్ బింద్‌పై పలు రౌండ్లు కాల్పులు జరిపి పారిపోయారు. వధువు బంధువైన ప్రియుడు వరుడ్ని హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. ఫోన్ కాల్స్ పరిశీలిస్తామని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని పోలీస్ అధికారి తెలిపారు.

# ఇద్దరు మోస్ట్ వాంటెడ్ ఆర్థిక నేరగాళ్ల అరెస్టు.





**న్యూఢిల్లీ:** ఇద్దరు మోస్ట్ వాంటెడ్ నేరస్తులను భారత్ పట్టుకున్నది. యూఏఈ అధికారుల సహకారంతో వాళ్లను అరెస్టు చేశారు. దొంగ పాస్‌పోర్టు రాకెట్ నడిపిన కేసులో అలోక్ కుమార్.. ఎస్బీఐ బ్యాంకులో 2672 కోట్ల మోసానికి పాల్పడిన కమలేశ్ పరేక్‌ను భారత్ అరెస్టు చేసింది. యూఏఈ నుంచి ఆ ఇద్దర్నీ భారత్‌కు తీసుకువచ్చారు. వేర్వేరు ఆపరేషన్స్ నిర్వహించి ఆ ఇద్దర్నీ అదుపులోకి తీసుకున్నారు. సీబీఐతో పాటు విదేశాంగ శాఖ ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నది. నకిలీ పాస్‌పోర్టు రాకెట్ నడిపిన అలోక్ కుమార్ అలియాస్ యశ్‌పాల్ సింగ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కోట్లల్లో బ్యాంకు మోసాలకు పాల్పడ్డ కమలేశ్ పరేక్‌ను కూడా యూఏఈలోనే అరెస్టు చేశారు. ఆర్థిక నేరగాళ్ల విషయంలో భారత్ సీరియస్‌గా ఉన్న విషయం తెలిసిందే. అలోక్ కుమార్ అలియస్ యశ్‌పాల్ సింగ్.. హర్యానా పోలీసుల వాంటెడ్ జాబితాలో ఉన్నాడు. అతనిపై చీటింగ్, ఫోర్జరీ, నేరపూరిత కుట్ర కేసులు ఉన్నాయి. క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న నేరగాళ్లకు ఫేక్ ఐడీ, విదేశీ అడ్రస్‌లతో పాస్‌పోర్టులు ఇప్పించాడతను. ఆ రాకెట్‌లో అలోక్ ప్రధాన నిందితుడు. కొందరికి ఇమ్మిగ్రేషన్ ఇప్పించినట్లు కూడా అతనిపై అభియోగాలు ఉన్నాయి.

# ప్రభుత్వాల్లో లోపించిన ఆర్థిక క్రమశిక్షణ !

తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. ఉద్యోగుల బకాయిలను చెల్లించలేని దుస్థితిలో తెలంగాణ ప్రభుత్వం ఉంది. ఎపిలో కిందామీదా పడి కేంద్రం నుంచి కొన్ని గ్రాంటలు తెచ్చుకుని సర్దుకుంటున్నారు. ఎన్‌డిఎలో చంద్రబాబు కీలకం కావడంతో ఇప్పుడు కేంద్రం ఆయన పాదాక్రాంతం అవుతోంది. చంద్రబాబును కేంద్రమంత్రులు పొగిడేస్తున్నారు. పథకాలకు సంబంధించి నిధులను ఆగమేఘాల మీద విడుదల చేస్తున్నారు. అయినా ఆర్థిక క్రమశిక్షణ ఇరు రాష్ట్రాల్లో కనిపించడం లేదు. తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క లెక్కలు సరిగా వేయడం లేదు. దుబారా ఖర్చులకు విదల్చడం తప్ప, అసలు వ్యవహారాల్లో పెద్దగా పట్టించుకోవడం లేదు. పెన్షనర్లు, ఉద్యోగులకే 8వేల కోట్ల బకాయలు ఉన్నాయంటే ఎంత దౌర్భాగ్యంగా ప్రభుత్వం నడుస్తుందో చెప్పవచ్చు. ఈ మధ్యే వేయికోట్లు విడుదల చేశారు. ఇకనుంచి నెలనెలా వేయికోట్లు విడుదల చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అయితే ఉద్యోగులకు వారికి చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించకుండా పోవడం దారుణం. అది గత కెసిఆర్ ప్రభుత్వమైనా, ఇప్పుడున్న రేవంత్ ప్రభుత్వమైనా వైఫల్యంగానే చూడాలి. జీతాలు 1వ తారీఖున వేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం మరింత అసమర్థతగా చూడాలి. దుబారా ఖర్చులు, దుబారా పథకాలు, హెలికాప్టర్ తిరుగుళ్లు మాత్రం ఆగడం లేదు. అందుకే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల విషయంలో ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం రెండున్నరేళ్లుగా నాన్చివేత ధోరణి కొనసాగించింది. ఆర్థికంగా భారం పడని సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఉద్యోగుల్లో అసంతృప్తి పేరుకుపోతోంది. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జిల్లాల్లో కలెక్టర్లు, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమావేశమై ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సి ఉండగా వారూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారీతనం లోపించడంవల్ల ఇలా జరుగుతోందని అనుకోవాలి. అధికార యంత్రాంగంలో బాధ్యతా రాహిత్యం వారసత్వంగా కొనసాగుతోంది. ఇకపోతే ఉద్యోగులు కూడా లంచాలకు మరిగారు. చిన్నపనికి కూడా లంచం లేనిదే ఫైలు ముట్టడం లేదు. అంతెందుకు మాట్లాడడం లేదు. పంచాయితీల్లో వేయి తడపనిదే మాట్లాడడం లేదంటే అవినీతి ఎంతగా పెరిగిందో చూడవచ్చు. జిల్లాలు పెరిగితే కలెక్టర్లకు పనులు సులువవుతాయని అనుకున్నారు. కానీ అసలు కలెక్టర్లు తమ క్షేత్ర పరిధిలో పర్యవేక్షించడం మానేశారు. గ్రామస్థాయిలో ఉద్యోగులపై అజమాయిషీ కనిపించడం లేదు. ఫలితంగా సమస్యలు పేరుకుపోవడమే కాకుండా కొత్త సమస్యలు తరుముకు వస్తున్నాయి. దీనికితోడు మంత్రుల్లో కూడా బాధ్యత కనిపించడం లేదు. ఎవరు కూడా సమస్యను పరిష్కరించాలన్న చొరవ చూపడం లేదు. ఆర్థికమంత్రి భట్టి చొరవ చూపి ఉంటే ఉద్యోగుల బకాయిలు ఇలా పేరుకు పోయేవి కావు. ఎంతసేపు ఆరు గ్యారెంటీలను అమలు చేశాం..మాది ప్రజాప్రభుత్వం అంటూ పోజులు ఇవ్వడం తప్ప ఏమీ చేయడం లేదు. అంతెందుకు జర్నలిస్టుల అక్రిడేషన్ల సమస్యకూడా రెండున్నరేళ్ల అయినా సక్రమంగా పరిష్కరించలేకపోయరు. అసమర్థ మంత్రులు, అధికారుల వల్లనేపరిస్థితి మరింత అయోమయంగా మారింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కొండల్లా పేరుకుపోతున్నా, రెండున్నరేళ్లుగా డిప్యూటి సిఎం భట్టి నోరు మెదపలేదు. ఆర్థికశాఖ చూస్తున్న ఆయన దీనిపై దృష్టి పెట్టలేదు. బకాయిలు అందక పలువురు పెన్షనర్లు న్యాయస్థానం తలుపు తట్టడం, ప్రభుత్వానికి కోర్టు అక్షింతలు వేయడం జరిగినా తక్షణంగా సమస్యను పరిష్కరించలేక పోయారు. అందుకు కారణం



లేకపోలేదు. ఉన్న డబ్బులు పందేరాలకు సరిపోతోంది. కొత్త పథకాలతో ప్రజలను బురిడీ కొట్టించేందుకు తయారవుతున్నారు. కమిషన్ల లేనిదే బిల్లులు పాస్ కావడం లేదని లోకం కోడై కూస్తున్నా మేల్కోవడం లేదు. నిజానికి పెన్షన్లు ఆపడం, బకాయిలు చెల్లించకపోవడం అన్నది కెసిఆర్ హయాంలోనే పెద్ద ఎత్తున జరిగింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే అమలు చేయడంతో బకాయిలు కొండల్లా పేరుకు పోయాయి. బకాయిల చెల్లింపు అనేది ప్రభుత్వం బాధ్యత. నిధుల కొరత అని ఈ బాధ్యత నుంచి తప్పించుకోలేరు. తెలంగాణ ప్రభుత్వమే కాదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఆర్థిక సంక్షోభంలోనే ఉంది. మిగతా రాష్ట్రాలు కూడా ఈ జాబితాలో చేరబోతున్నాయి. ఇందుకు ఉచిత పథకాలు తెల్ల ఏనుగుల్లా సవారీ చేస్తున్నాయని గుర్తించడం లేదు. ప్రభుత్వాలు అప్పుల ఊబిలో కూరుకుపోవడానికి రాజకీయ పార్టీల ఉచిత పథకాల తీరే కారణం. ఇందులో ఎటువంటి మొహమాటం అక్కర్లేదు. వివిధ స్థాయిలలో నిర్లక్ష్యం ప్రవేశించడంతో జవాబుదారీ తనం లోపించింది. సమస్య ఏదైనా దాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదే. ఆయన కిందిస్థాయిలో ఏం జరుగుతందో తెలుసుకోవడం లేదు. ప్రభుత్వంపై పట్టు సాధించలేక పోతున్నారు. దీనికితోడు కాంగ్రెస్‌లో సొంత నిర్ణయాలు తీసుకునే వెసలుబాటు ఉండదు. మొత్తంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సమస్యల ఊబిలో చిక్కుకుపోతోంది. ఆర్థిక కష్టాలు ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అలవిగాని హామీల అమలుకు ప్రయత్నించి, అది సాధ్యం కాక ప్రభుత్వం చతికిలపడుతోంది. రైతుబంధు వంటి పథకాన్ని కూడా విడతల వారీగా అమలు చేయాల్సిన దుస్తితి కొనితెచ్చుకున్నారు. అప్పులు చేయడం, వడ్డీలకు చెల్లించడం నిత్యకృత్యంగా మారింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకే ఎనిమిది వేల కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బిల్లుల చెల్లింపులో ప్రాధాన్యాలు పాటించకపోవడం,రాజకీయ పలుకుబడిని బట్టి చెల్లింపులు చేయడం వల్ల వివిధ వర్గాల ప్రజల్లో అసంతృప్తి నెలకొంటోంది. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించలేకుండా, అభివృద్ది పనులు చేయకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని హుంకరిస్తే..ప్రజలు ఆదరించాలని గుర్తించాలి. అధికారం అన్నది ప్రజల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉందని గుర్తించి మసలుకుంటే మంచిది.

# హోర్మ్యూజ్ జలసంధిపై కొత్త నియమాలు

**● పూర్తిగా మా ఆధీనంలోనే ఉండేలా చర్యలు ● ఇస్లామిక్ రివెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కీలక ప్రకటన**



**టెహ్రాన్,మే2:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో ఇస్లామిక్ రివెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కీలక ప్రకటన చేసింది. చమురు సరఫరాలో కీలక మార్గమైన హోర్ముజ్ జలసంధిపై కొత్త సముద్ర నియమాలు అమలు చేయనున్నట్లు వెల్లడించింది. అరేబియా గల్ఫ్, హోర్ముజ్ జలసంధి మార్గాలపై తమ నియంత్రణను బలోపేతం చేసే ఉద్దేశంతో ఐఆర్‌జీసీ కొత్త నిబంధనలను అమలు చేయనున్నట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా పేర్కొంది. అరేబియా గల్ఫ్, హోర్ముజ్ జలసంధి మీదుగా విస్తరించి ఉన్న దాదాపు 2 వేల కిలోమీటర్ల ఇరాన్ తీర ప్రాంతంపై తమ పర్యవేక్షణ ఉంటుందని ఐఆర్‌జీసీ నావికా దళ కమాండర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ మార్గంలో రవాణాపై త్వరలోనే కొత్త నిబంధనలను అమలు చేస్తామని తెలిపారు. తమ చర్యలు ఇరాన్ ప్రజలకు గర్వకారణంగా ఉంటాయన్నారు. సముద్ర భద్రతను బలోపేతం చేయడం, విదేశీ జోక్యాన్ని తగ్గించడం, ప్రాంతీయ నియంత్రణను పెంచడం, వాణిజ్య మార్గాలను తమ ఆధీనంలో ఉంచడమే ఆ నిబంధనల లక్ష్యాలని తెలిపారు. హోర్ముజ్ జలాలు భద్రత, అభివృద్ధికి మూలంగా మారాలని తాము కోరుకుంటున్నట్టు ఐఆర్‌జీసీ పేర్కొంది . కాగా, 'పర్షియన్ గల్ఫ్ కేవలం నీలి జలాల కేంద్రం మాత్రమే కాదు. అది మన గుర్తింపు. మన నాగరికతలో ఒక భాగం. ప్రపంచ దేశాల మధ్య అనుసంధాన కేంద్రం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలక మార్గం' అని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఓ ప్రకటన విడుదల చేశారు. పర్షియన్ గల్ఫ్‌ను లక్ష్యంగా చేసుకుని కుట్రలు పన్నుతున్న విదేశీ బలగాలకు ఇది ఓ హెచ్చరికగా చూడాలి. పర్షియన్ గల్ఫ్, హర్మ్యూజ్ జలసంధి విషయంలో కొత్త అధ్యాయం మొదలుకానుందని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఐఆర్‌జీసీ నౌకాదళ విభాగం కీలక ప్రకటన చేసింది. పర్షియన్ గల్ఫ్, హర్మ్యూజ్ జలసంధిలోని కీలక సముద్ర మార్గాలపై తమ నియంత్రణను బలోపేతం చేయాలనుకుంటున్నట్లు తెలిపింది. దీనికి సంబంధించిన సమీకరణాలు, నిబంధనలు సిద్ధమయ్యాయని.. సుప్రీం లీడర్ ఆదేశాలకు అనుగుణంగా వాటిని అమలుచేస్తామని వెల్లడించింది. ఇరాన్ ప్రజల శక్తిసామర్థ్యాలు, గొప్పతనానికి ప్రతీకగా, జీవనోపాధి, ప్రాంతీయ భద్రతకు ఆధారంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని ఐఆర్‌జీసీ నౌకాదళం ఓ ప్రకటన చేసినట్లు ఇరాన్ అధికారిక మీడియా 'ప్రెస్ టీవీ' తెలిపింది. మరోవైపు.. హర్మ్యూజ్‌లో అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. ఇప్పటివరకు 42 నౌకలను అడ్డుకున్నామని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఇటీవల పర్షియన్ గల్ఫ్ దినోత్సవం సందర్భంగా హర్మ్యూజ్ జలసంధికి సంబంధించి ఇరాన్ సుప్రీం లీడర్ ఓ సమగ్ర వ్యూహాత్మక ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ కీలక జలమార్గంపై ఇరాన్ అధికారం, నిర్వహణ అంశాలను అందులో ప్రస్తావించారు. జలసంధి నుంచి వచ్చే ఆదాయాన్ని ఇరాన్ రియాల్స్‌లో వసూలుచేయడం, ఇరాన్‌పై ఆంక్షలు విధించిన, దురాగతాలకు పాల్పడిన దేశాల నౌకలు పరిహారం చెల్లించేలా చూడటం, నౌకల రాకపోకలను మా సైనికులే నియంత్రించేలా చూడటం వంటివి ప్రణాళికలో ఉన్నాయి.

# ఇరాన్ ప్రతిపాదనలు నచ్చలేదు

**● మరోమారు మెలిక పెట్టిన ట్రంప్**



**వాషింగ్టన్,మే2:** పశ్చిమాసియాలో కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ శాంతి చర్చల విషయంలో మాత్రం పూర్తి స్పష్టత రావడం లేదు. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఒప్పందం విషయంలో విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా పాకిస్థాన్ ద్వారా ఇరాన్ పంపించిన ప్రతిపాదన తనకు నచ్చలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని హెచ్చరించారు. 'ఇరాన్ ప్రతిపాదన అంగీకరించదగిన స్థాయిలో లేదు. ఒప్పందం సాధ్యమవుతుందో లేదో చెప్పడం కష్టం' అని ట్రంప్ తాజాగా పేర్కొన్నారు. దీంతో ఇరాన్-అమెరికా మధ్య చర్చలు ఇంకా అనిశ్చితిలోనే ఉన్నట్టు అర్థమవుతోంది. తమ దేశంపై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయాలని, నౌకా దిగ్బంధనం తొలగించాలని ఇరాన్ అడుగుతోంది. అలాగే అణు కార్యక్రమం గురించి ఇప్పటికప్పుడు ఒక ఒప్పందానికి రాకూడదని భావిస్తోంది. అయితే అమెరికా మాత్రం తమ డిమాండ్లను నెరవేరిస్తేనే చర్చలపై ముందుకు వెళ్లాలని అనుకుంటోంది అణు కార్యక్రమం విషయంలో పూర్లి స్పష్టత కావాలని, అలాగే హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవాలని , అప్పటివరకు నౌకా దిగ్బంధన కొనసాగుతుందని అమెరికా స్పష్టం చేసింది. దీంతో ఇరు దేశాల మధ్య చర్చలు అనిశ్చితిలో పడ్డాయి. 'ఒప్పందం కుదరకపోతే ఇతర మార్గాలను కూడా పరిశీలించాల్సి వస్తుంది' అని ట్రంప్ తాజాగా హెచ్చరించారు. సైనిక చర్యలకు దిగే అవకాశాలున్నాయని సంకేతాలు ఇచ్చారు.

# సుప్రీంలో మమతా బెనర్జీకి చుక్కెదురు



**కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయమే సుప్రీం**

**న్యూఢిల్లీ,మే2:** సుప్రీంకోర్టులో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. ఓట్ల లెక్కింపులో కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం మేరకు నడుచుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై టీఎంసీ నేతలు నమ్మకం ఉంచాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపులో పర్యవేక్షకులుగా కేవలం కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మాత్రమే ఎలక్షన్ కమిషన్ నియమించడాన్ని సవాలు చేస్తూ టీఎంసీ వేసిన పిటిషన్‌ను కోల్‌కతా హైకోర్టు కొట్టివేసింది. కోల్‌కతా హైకోర్టు తీర్పును టీఎంసీ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. టీఎంసీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ పి.ఎస్. నరసింహ, జయమాల్య బాగ్చీలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం తాజాగా విచారించింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా తమకు వ్యతిరేకంగా వెళ్తారనే టీఎంసీ వాదన సరికాదని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగులపై విశ్వాసం ఉంచాలని సూచించింది. పర్యవేక్షకులుగా కేవలం కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మాత్రమే నియమిస్తూ ఈసీ జారీ చేసిన సర్క్యులర్ నిబంధనలకు విరుద్ధంగా లేదని పేర్కొంది. ఓట్ల లెక్కింపు సమయంలో అక్కడ టీఎంసీ ప్రతినిధులు కూడా ఉంటారని వివరించింది. ఓట్ల లెక్కింపు సిబ్బందిని కేవలం ఒకే వర్గం నుంచి ఎంచుకునే వెసులుబాటు ఎలక్షన్ కమిషన్‌కు ఉందని పేర్కొంది. టీఎంసీ పిటిషన్‌పై తదుపరి ఆదేశాలు అవసరం లేదని పేర్కొంది. ఏప్రిల్ 13 నాటి ఆ సర్క్యులరే అమలవుతుందని స్పష్టం చేసింది.

# లేహ్‌లో బుద్ధుని అవశేషాల ప్రదర్శన



**ప్రదర్శనను ప్రారంభించిన అమిత్ షా**


**జమ్మూ,మే2:** క్రీస్తు పూర్వానికి చెందిన గౌతమ బుద్ధుని పవిత్ర భౌతిక అవశేషాలు... ప్రజల సందర్శనార్థం లద్దాఖ్‌లో కొలువుదీరాయి. ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రస్తుత సిద్దార్థనగర్ ప్రాంతంలో నేపాల్ సరిహద్దుకు సమీపంలో 1898లో లభించిన తథాగత బుద్ధుని అవశేషాలను ఇటీవల లేహ్ ప్రాంతానికి తరలించారు. ఈ బుద్ధ అవశేషాలను విలియమ్ క్లాక్స్‌టన్ పెప్పె అనే బ్రిటిష్ జమీందారు ఒక పురాతన స్తూపంలో కనుగొన్నాడు. అవశేషాల్లో అస్థికలతోపాటు 1500 విలువైన రాళ్లు, బంగారు ఆభరణాలు కూడా ఉన్నాయి. వీటిని గత సంవత్సరం భారత్‌కు అందజేశారు. తాజాగా లేహ్ ప్రాంతంలోని జీవేత్సల్‌లో 2569వ బుద్ధ పూర్ణిమ సంబరాల సందర్భంగా ఈ అవశేషాల ప్రదర్శనను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శుక్రవారం ప్రారంభించారు.

# అధికారులకు తలనొప్పిగా మారిన ప్రజాపాలన

**– కాంగ్రెస్ పథకాలపై తిరగబడుతున్న ప్రజలు**

**– ప్రజాపాలన కార్యక్రమానికి వెనుకడుగేస్తున్న అధికారులు**

**– ప్రజా పాలన కార్యక్రమలలో పోలీసులు, బీజి.. రెచ్చిపోతున్న దొంగలు**



**పరిగి మే 3 :** ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటూ నిర్వహించి తలపెట్టిన 99 రోజుల 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమనికి తొలిరోజు నుండే ప్రజల నుండి నిరసనల సెగ తగిలింది. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'గ్రామసభ' లు ప్రజాగ్రహ వేదికలుగా మారాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్న ఆరు గ్యారెంటీలు అమలు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు రూ.2,500 హామీ ఎందుకు అమలు చేయడం లేదు? పింఛన్లు రూ.4వేలకు ఎప్పుడు పెంచుతారు? రైతు భరోసా ఏది..? పూర్తిస్థాయిలో రుణమాఫీ ఎక్కడ జరిగింది. అంటూ ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు లేని యూరియా తిప్పలు ఇప్పుడే ఎందుకు వస్తున్నదంటూ.. అధికారులను పాలకులను నిలదీస్తున్నారు. పార్టీ కార్యక్రమాలలో అధికారులను కార్యకర్తల్లా వాడుకుంటున్నారు. వారి పనులను పక్కనపెట్టి పార్టీ కార్యక్రమలలో పాల్గొనవలసిన పరిస్థితి నెలకొందంటూ అధికారులు వాపోతున్నారు. అంతేకాకుండా అధికారిక కార్యక్రమాలలో అధికారులతో సమానంగా కూర్చుం టున్న చోట మోటా నాయకులు, ఏదైనా సమస్య చెప్పుకోవాల్సిన సామాన్య ప్రజలు అధికారులు ఎవరో పాలకులు ఎవరో తెలియక వారి సమస్యలను చెప్పుకోలేని పరిస్థితి ప్రజలు వాపోతున్నారు.

**– ప్రజాపాలన పై ప్రజా వ్యతిరేకత..**

కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన కాదని, ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలన అని ప్రజలు ఆరోపించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికల కార్యక్రమంలో భాగంగా పలు పథకాలపై నిర్వహి స్తున్న గ్రామ, వార్డు సభల్లో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నది. కాంగ్రెస్ చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అధికారులపై ఊరూరా తిరగబడుతున్న జనం, దీన్నిబట్టి చూస్తే కాంగ్రెస్ ప్రజా పాలన పెద్ద ఫెయిల్యూర్ అని అర్థమవుతుంది. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారా నడుమ గ్రామసభలు నిర్వహించాల్సిన దుస్థితి రావడం దారుణము యావత్ తెలంగాణ ఏకమై అడుగడుగునా ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తోంది. అందరికీ సంక్షేమ పథకాలిస్తామని ఇప్పుడు భారీగా కోతలు విధిస్తే ప్రజలు తిరగబడుతున్నారు. కాంగ్రెస్ రాక్షస పాలనలో ప్రజలు తిరగబడుతున్నారు.

**– పథకాలపై నిలదీస్తున్న ప్రజలు**

ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నదని.. 99 రోజుల ప్రణాళిక మొదలు పెట్టిన రోజు నుండే ఎమ్మెల్యేలతో సహా చోటా మోటా కాంగ్రెస్ నాయకులకు తెలిసింది. తాము గ్రామ సభలకు వెళ్లలేమని, ప్రస్తుత పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించే పరిస్థితులే లేవని తేల్చిచెప్పినట్టు సమాచారం. ప్రభుత్వపరంగా మనం ఏదో చేశామని గొప్పగా చెప్తున్నప్పటికీ అవేవీ ప్రజలకు చేరడం లేదని, ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని తేల్చి చెప్తున్నట్టు తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం పేరు చెప్తేనే ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నారు.

**– కార్యకర్తల్లా పనిచేస్తున్న అధికారులు,**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా అన్ని శాఖల అధికారులకు కార్యక్రమంలో పాల్గొనాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు ఉండడంతో వారి విధులను పక్క నపెట్టి ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనవలసిన పరిస్థితి నెల కొంది. దీంతో వారి విధులకు సంబంధించిన చాలా మాటికి పనులు పెండింగ్లో ఉంటున్నాయని అధికారులు చెప్పకనే చెప్త న్నారు. మా ఉద్యోగాలు తప్ప ప్రభుత్వానికి చేయవలసిన అన్ని పనులు కార్యకర్తల్లా పనిచేస్తున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఇక్కడ విధులు చూడాలా లేక పార్టీ కార్యక్రమంలో పాల్గొ నాలా అనే అపోహల్లో అధికారులు ఉన్నారు. అధికారులను పార్టీ కార్యకలాపాలకు కాంగ్రెస్ పార్టీ వాడుకున్నంతగా మరే పార్టీ వాడుకోలేరని అధికారులు వాపోతున్నారు.

**– ప్రజా పాలన కార్యక్రమంలో పోలీసులు రెచ్చిపోతున్న దొంగలు..**

కాంగ్రెస్ చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో బిజీబిజీగా పోలీసులు, ఇదే అదునుగా భావించిన దొంగలు రెచ్చిపోతున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో పోలీసులు బిజీగా ఉండడంతో గ్రామాల్లో పట్టణాలు తేడా లేకుండా పట్టా పగలే దొంగలు రెచ్చిపోతూ ఇల్లు దోచుకుంటున్నారు. ఇటీవల వికారాబాద్ జిల్లా కేంద్రంలోనే పట్టపగలు ఓ ఇంట్లో దొం గత నానికి పాల్పడిన ఘటన అందరికీ తెలిసిందే పోలీసులు వారి ఉద్యో గాలను పక్కనపెట్టి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అనవ సర మైన కార్యక్రమాలలో పాల్గొనడమే దొంగలకు వరంగా మారి ందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు పార్టీ కార్య క్రమాలను పక్కనపెట్టి ప్రజా శ్రేయస్సు కోసం పనిచేయాలని కోరుతున్నారు.

## తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్



**పరిగి టౌన్ మే 3 :** ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించి ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలి. వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి, అన్నారు. శనివారం వికారాబాద్ ఆర్డిఓ వాసు చంద్ర, తో కలిసి పరిగి తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి, ఈ సందర్భంగా మండలనికి సంబందించిన కార్డులను పరిశీలించి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పూర్తిచేయాలని తహసిల్దారు వెంకటేశ్వరి, కి తెలిపారు, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించి సకాలంలో రెవెన్యూ ఆర్జీలను పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. అనంతరం రికార్డు గది సిబ్బంది గదలను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ విజయేందర్, ఆర్ఐ దివ్య, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పరిగిలో ఘోర రోడ్డు ప్రమాదం

**– పలువురికి తీవ్ర గాయాలు**





**పరిగి మే 3 :** వికారాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం ఎదురెదురుగా వస్తున్న గూడ్స్ వాహనం కారు ఢీ పలువురికి గాయాలు, ఈ ఘటన పరిగి మండలం రంగాపూర్ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ప్రమా దంలో తీవ్ర గాయాలపాలైన వారిని చికిత్స కొరకు పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కొరకు వికారాబాద్ ఆసుపత్రికి తరలించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో కారులోని ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడం వల్లన పెద్ద ప్రాణాపాయం తప్పిందని బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని

ఈ ప్రమాదానికి సంబంధించి కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## శాంతియూత వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకోవాలి

**– కుల్కచర్ల ఎస్ఐ రమేష్ కుమార్**



**కుల్కచర్ల మే 3 :** శాంతియుత వాతావరణంలో బక్రీద్ పండగ జరుపుకోవాలని కుల్కచర్ల ఎస్ఐ రమేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఈ నెల 27 వ తేదీన జరుపుకోనున్న బక్రీద్ పండుగను ఆనం దంగా జరుపుకోవాలని సూచించారు. బక్రీద్ పండుగ సంద ర్భ ంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జాగ్ర త్తలు తీసుకుంటున్నామని వెల్లడించారు. మండల వ్యాప్తంగా అక్ర మంగా పశువులను తరలించకుండా చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తునమ్మన్నారు.

**– జంతువుల రవాణా పై నిషేధం**

బక్రీద్ పండుగ సందర్భంలో, గోవులు సహా ఇతర జంతువులను వధ కోసం రవాణా చేయడం పూర్తిగా నిషేధించబడింది. ఈ నిబంధనలను అతిక్రమించిన వారికి చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి.

**– అవసరమైన పత్రాలు తప్పనిసరి**

ఎవరైనా జంతువులను రవాణా చేయాల్సిన అవసరం ఉన్నచో, వారు తప్పనిసరిగా వెటర్నరీ డాక్టర్ ఇచ్చిన సర్టిఫికేట్, మరియు సం బంధిత గ్రామపంచాయతీ అనుమతి పత్రం తప్పక కలిగి ఉం డాలి. ఈ పత్రాలు లేని రవాణాను అక్రమంగా పరిగణించబడుతుంది.

**– రైతులకు సూచనలు**

రైతులు, ముఖ్యంగా గోవులు ఎద్దులు కొనుగోలు/అమ్మకం చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలి. సరైన పత్రాలు లేకుండా జంతువుల లావాదేవీలు చేయకూడదు. పంచాయతీ అనుమతి, వెటర్నరీ డాక్టర్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలని ఎస్సై రమేష్ కుమార్ అన్నారు


**– అక్రమ రవాణా పోలీసులకు సమాచారం ఇవ్వాలి..**

వివిధ సంఘాల నాయకులు కార్యకర్తలు, జంతువుల అక్రమ రవాణా గురించి సమాచారం వచ్చినపుడు, స్వయంగా చర్యలు తీసుకోవడానికి ప్రయత్నించకుండా, వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ఎస్సై కోరారు.

**– నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు..**


ఎవరైనా ఈ నిబంధనలను ఉల్లంఘించినా, సామాజిక శాంతి భద్రతలకు భంగం కలిగించినా, పోలీసు శాఖ వెంటనే స్పందించి, కఠినంగా చట్టబద్ధంగా చర్యలు తీసుకుంటుందని ఆయన హెచ్చరించారు.

## వృద్ధులకే కాదు.. యువతలోనూ పెరుగుతున్న బ్రెయిన్ స్ట్రోక్



స్ట్రోక్ బారిన పడుతున్న వారిలో యువత సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. గతంలో కేవలం వృద్ధుల సమస్యగా భావించే బ్రెయిన్ స్ట్రోక్.. ఇప్పుడు యువతనూ వెంటాడుతున్నది. మొత్తం పక్షవాత కేసుల్లో సుమారు 14 శాతం మంది 18–44 ఏళ్ల మధ్య వయసు గలవారే ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) తాజా అధ్యయనం ఈ విషయాన్ని వెల్లడించింది. పలు ఆసుపత్రులలోని 34,000కు పైగా కేసులను పరిశీలించిన అధ్యయనకారులు.. పెరుగుతున్న ప్రజారోగ్య సమస్యను బయటపెట్టారు. అంతేకాకుండా పాశ్చాత్య దేశాలతో పోలిస్తే మనదేశంలో చిన్న వయసులోనే పక్షవాతాలు సంభవిస్తున్నాయని స్పష్టం చేస్తున్నారు. భారత్‌లో స్ట్రోక్ ఒక ప్రధాన ప్రజారోగ్య సవాలుగా మారిందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మరణానికి నాలుగో ప్రధాన కారణంగా, అంగవైకల్యానికి ఐదో ప్రధాన కారణంగా నిలుస్తున్నట్లు వెల్లడించారు. శారీరక శ్రమ లేకపోవడం, గంటల తరబడి కూర్చుని పని చేయడమే యువతలో స్ట్రోక్‌కు ప్రధాన కారణమని చెబుతున్నారు. అంతేకాకుండా, జంక్ ఫుడ్, అధిక ఉప్పు వినియోగం, ప్రాసెస్ చేసిన ఆహారం తీసుకోవడం వల్ల చిన్న వయసులోనే రక్తపోటు పెరుగుతున్నది. కెరీర్, వ్యక్తిగత జీవితంలో ఎక్కువగా ఒత్తిడికి గురవ్వడం, సరైన నిద్ర లేకపోవడం వల్ల రక్తనాళాలపై ప్రతికూల ప్రభావం పడుతున్నది. పొగతాగడం, మద్యం సేవించడం వల్ల రక్తనాళాలు గట్టిపడి, రక్త ప్రసరణకు ఆటంకం కలుగుతున్నది. ఇవన్నీ కలిసి చిన్నవయసులోనే స్ట్రోక్ ముప్పును పెంచుతున్నాయని అధ్యయనకారులు వెల్లడిస్తున్నారు. పని ఒత్తిడిని తగ్గించుకోవడం, ప్రశాంతంగా ఉండటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం లాంటి మార్పులతో ఈ ప్రమాదం నుంచి బయట పడొచ్చని

## చక్కెరకు బదులుగా వాడుకోవాల్సిన ప్రత్యామ్నాయ తీపి పదార్థాలు ఇవే.. ఎంత మోతాదులో తీసుకోవాలంటే..



తీపి కోసం ఎక్కువగా చక్కెరపై ఆధారపడుతూ ఉంటారు. అనేక తీపి వంటకాల్లో చక్కెరను ఉపయోగిస్తూ ఉంటారు. అయితే చక్కెరపై చాలా మందికి మిశ్రమ భావనలు ఉంటాయి. ఆరోగ్యానికి మంచిది కాదని తెలిసినా, తీపి పదార్థాలు తినకుండా ఉండలేరు. అయితే ఇప్పుడు ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని, రుచి తగ్గకుండా ఉపయోగించుకునే సహజ ప్రత్యామ్నాయ స్వీట్‌నర్లు అందుబాటులోకి వచ్చాయి. ఇవి గ్లైసెమిక్ ఇండెక్స్, పోషకాలు, రుచుల్లో తేడా కలిగి ఉన్నప్పటికీ భారతీయ వంటకాలలో సులభంగా ఉపయోగించుకోవచ్చు. అయితే ఒక ముఖ్యమైన విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి. తెల్ల చక్కెరకు బదులుగా ఆరోగ్యకరమైన స్వీట్‌నర్ వాడుతున్నప్పటికి ఎక్కువగా తినొచ్చనే అర్థం కాదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం, రోజువారీ క్యాలరీలలో 10 శాతం కన్నా తక్కువ మాత్రమే చక్కెరల నుంచి రావాలి. నిపుణులు రోజుకు రెండు టీ స్పూన్లు మించకూడదని సూచిస్తున్నారు. చక్కెరకు బదులుగా వాడుకోదగిన ఇతర స్వీట్‌నర్ల గురించి అలాగే వాటిని ఎలా తీసుకోవాలి.. అన్న వివరాల గురించి వారు వివరిస్తున్నారు. బెల్లం, తేనె..భారతీయ ఇళ్లలో తరతరాలుగా ఉపయోగిస్తున్న బెల్లం ఒక మంచి ప్రత్యామ్నాయం. ఇది తక్కువ ప్రాసెసింగ్‌తో తయారవుతుంది కాబట్టి ఐరన్, కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు ఉంటాయి. దీని రుచి గాఢంగా ఉండి ఖీర్, హల్వా, లడ్డూల వంటి వంటకాలకు ప్రత్యేకమైన టేస్ట్ ఇస్తుంది. తేనె కూడా మరో ఆరోగ్యకరమైన స్వీట్‌నర్. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, ఎంజైములు ఉంటాయి. అయితే తేనెను అధిక ఉష్ణోగ్రతకు వేడి చేయకూడదు. చల్లని లేదా స్వల్పంగా వేడిగా ఉన్న పదార్థాల్లో కలిపి వాడుకోవాలి. అదే విధంగా ఖర్జూరాలు (డేట్స్), డేట్ సిరప్ సహజంగా తీపి కలిగినవి. వీటిలో ఫైబర్, పొటాషియం, ఐరన్ లాంటి పోషకాలు ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర శోషణను నెమ్మదింపజేస్తాయి. లడ్డూలు, ఎనర్జీ బాల్స్ తయారీలో ఇవి బాగా ఉపయోగపడతాయి. కొబ్బరి చక్కెర..అలాగే కొబ్బరి చక్కెర (కోకనట్ షుగర్) కూడా మంచి ప్రత్యామ్నాయం. దీన్ని సాధారణ చక్కెరలా ఉపయోగించుకోవచ్చు. గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటంతో బేకింగ్‌లో విస్తృతంగా దీనిని వాడుతున్నారు. మేపిల్ సిరప్ భారతీయ వంటల్లో సంప్రదాయ పదార్థం కాకపోయినా, ఇప్పుడు ఆరోగ్యకరమైన స్వీట్‌నర్‌గా ప్రాచుర్యం పొందింది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, ఖనిజాలు ఉంటాయి. తక్కువ పరిమాణంలోనే ఎక్కువ తీపి ఇస్తుంది. స్టీవియా అనే మొక్క నుంచి తీసిన స్వీట్‌నర్‌లో కాలరీలు, గ్లైసెమిక్ ఇండెక్స్ రెండూ శూన్యం. మధుమేహం ఉన్నవారికి ఇది అనుకూలమని నిపుణులు చెబుతున్నారు. అయితే స్వల్పంగా చేదును కూడా కలిగి ఉంటుంది.

మోంక్ ఫ్రూట్ స్వీట్‌నర్..మోంక్ ఫ్రూట్ స్వీట్‌నర్ కూడా తక్కువ కాలరీలు, గ్లైసెమిక్ ప్రభావం లేకుండా తీపి ఇస్తుంది. ఇది స్టీవియాతో పోలిస్తే రుచిలో కొంచెం మెరుగ్గా ఉంటుంది కానీ ధర ఎక్కువగా ఉంటుంది. పండ్ల ప్యూరీలను కూడా సహజ స్వీట్‌నర్‌లుగా ఉపయోగించవచ్చు. పండిన అరటి, మామిడి, ఆపిల్ ప్యూరీలు మిఠాయిల్లో చక్కెర అవసరాన్ని తగ్గిస్తాయి. ఇవి ఫైబర్, విటమిన్లు అందించడమే కాకుండా జీర్ణక్రియకు సహాయపడతాయి. ఇక ఏ స్వీట్‌నర్ ఎంచుకోవాలో వారి వ్యక్తిగత అవసరాలపై ఆధారపడి ఉంటుంది. మధుమేహం నియంత్రణ కోసం స్టీవియా లేదా మోంక్ ఫ్రూట్ సరైనవి. రుచి, పోషకాల కోసం బెల్లం, తేనె, ఖర్జూరాలు ఉపయోగకరమైనవి. బేకింగ్ కోసం కొబ్బరి చక్కెర, మేపిల్ సిరప్ అనువైనవి. సహజ స్వీట్‌నర్లు ఆరోగ్యానికి కొంత మెరుగైన ఎంపిక అయినప్పటికీ, మితంగా తీసుకోవడం అత్యంత ముఖ్యమైన విషయం. సరైన పరిమితిలో వాడితేనే ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

## అవకాడోతో ఆరోగ్యం ప్రయోజనాలెన్నో.. తెలిస్తే అస్సలు వదలరు



ఎండాకాలంలో మన శరీరం అధిక వేడికి గురవుతుంది. ఈ సమయంలో చర్మం, కళ్లు, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి పోషకాహారం తీసుకోవడం చాలా ముఖ్యం. అనేక రకాల పోషకాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు కలిగిన 'అవకాడో' పండును ఈ సీజన్‌లో తీసుకోవడం వల్ల అద్భుతమైన ప్రయోజనాలు చేకూరతాయి. రోజూ ఒక అవకాడో తినడం వల్ల కలిగే లాభాలు గురించి తెలుసుకుందాం.. 1. చర్మ సౌందర్యం, రక్షణ:ఎండల తీవ్రతకు చర్మం డీహైడ్రేషన్ బారినపడుతుంది. అవకాడోలో ఉండే విటమిన్ ఇ , ఆరోగ్యకరమైన మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు చర్మాన్ని లోపలి నుంచి హైడ్రేట్‌గా ఉంచుతాయి. ఇది సహజమైన మాయిశ్చరైజర్‌గా పనిచేస్తూ, ఎండ వల్ల కలిగే చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. 2. కంటి ఆరోగ్యం:అవకాడోలో లూటిన్, జియాక్సంతిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎండలోని హానికరమైన కాంతి నుంచి కళ్లను రక్షించడమే కాకుండా దృష్టి లోపాలు రాకుండా కాపాడతాయి. 3. జీర్ణక్రియ మెరుగుపడుతుంది:వేసవిలో చాలామందికి జీర్ణ సంబంధిత సమస్యలు వస్తుంటాయి. అవకాడోలో ఫైబర్ (పీచు పదార్థం) ఎక్కువగా ఉంటుంది. ఇది మలబద్ధకాన్ని నివారించి, జీర్ణవ్యవస్థను క్రమబద్ధీకరించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. 4. గుండె ఆరోగ్యానికి మేలు:ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది.

ఆదివారం, మే 03, 2026 | పీపుల్స్ న్యూస్ | 10

## కాంగ్రెస్ నేత మహమ్మద్ ఆయూబ్ జన్మదినం వేడుక సీఎం రేవంత్, రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి ఆశీర్వాదం స్వీకరించారు





**వరంగల్ :** వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ ఆయూబ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లను మర్యా ద పూర్వకంగా కలిసి వారి ఆశీస్సు లు తీసుకున్నారు. జన్మదినాన్ని పురస్కరించుకొని ఆశీస్సులు అంద జేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లకు మహమ్మద్ అయూబ్ కృతజ్ఞతలు తెలిపారు.ం

## దుమ్ముగూడెంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన



**భద్రాద్రి కొత్తగూడెం:** దుమ్ముగూడెం మండలంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి , భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలోని విద్యార్థులందరూ నాణ్యమైన విద్యను అందుకుని ఉన్నతంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఏజెన్సీ ఏరియాలో విద్యా ప్రమాణాలు పెంచడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం అని, పిల్లల భవిష్యత్తుకు ఈ స్కూల్ దోహదపడుతుందని అన్నారు.

- శంకుస్థాపన శిలాఫలకాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఆవిష్కరించారు.- కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీస్ సిబ్బంది, మీడియా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.- వెనుక భాగంలో స్కూల్ డిజైన్‌లకు సంబంధించిన ఫోటోలను ప్రదర్శించారు.

ఈ స్కూల్ ఏర్పాటుతో దుమ్ముగూడెం మండలంతో పాటు చుట్టుపక్కల ఏజెన్సీ గ్రామాల విద్యార్థులకు అత్యాధునిక వసతులతో కూడిన విద్య అందుబాటులోకి రానుంది.

## ప్రభుత్వ భూములపై కబ్జాలు రెవిన్యూ శాఖ మౌనం ఎందుకు

- "కంచె వేసిన ప్రభుత్వ భూమిపైనే కబ్జా
- "కోట్ల విలువైన ప్రభుత్వ భూములపై కబ్జాలు
- బాధ్యత ఎవరిది?"
- "తాసిల్దార్ లు హద్దులు పెట్టిన స్థలంలో అక్రమ నిర్మాణం
- రెవిన్యూ శాఖ ఎక్కడ"




**ఏటూరు నాగారం :** ఏజెన్సీ గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు అక్రమంగా కబ్జాకు గురవుతున్నా, వాటిని అరికట్టాల్సిన రెవిన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములపై నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై ఏజెన్సీ మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మండలంలోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపిడిఓ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న ఎకరాల కొద్ది ప్రభుత్వ భూములను కొందరు వ్యక్తులు ఆక్రమించి భవన నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారుల కళ్లముందే ఈ అక్రమాలు జరుగుతున్నా, చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

2020 సంవత్సరంలో అప్పటి ఓ ఎమ్మార్వో , జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేయించి, హద్దులు నిర్ణయించి కంచె ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఆ కంచెను తొలగించి ఒక వ్యక్తి స్థలాన్ని ఆక్రమించి భవన నిర్మాణం చేపట్టినట్లు సమాచారం.

ఇంత స్పష్టంగా ప్రభుత్వ భూమిగా గుర్తింపు పొందిన స్థలంలోనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా, రెవిన్యూ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై తక్షణమే స్పందించి అక్రమ కట్టడాలను నిలిపివేసి, కబ్జా చేసిన భూములను తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. . ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. లేని పక్షంలో దశల వారీగా ఉద్యమాలు చేయడం జరుగుతుంది అంటూ ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాల అమలు

- ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వ సాయం కొండంత అండ
- స్వయం సహాయక సంఘాల రుణాలతో మహిళా సాధికారత సాధ్యం
- నిరుపేదల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి సహాయ నిధి భరోసా
- ప్రతి గడపకూ ప్రభుత్వ ఫలాలు అందడమే నిజమైన అభివృద్ధి
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



**భద్రాద్రి కొత్తగూడెం :** పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం చుంచుపల్లి మండలంలోని కమ్మ సత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు సుమారు రూ. 6.22 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వ సాయం కొండంత అండగా నిలుస్తోందని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 86 మందికి రూ. 86.09 లక్షల విలువైన చెక్కులను అందజేశామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల రుణాలతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఆకాంక్షిస్తూ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా 49 సంఘాలకు రూ. 5.25 కోట్ల రుణాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. నిరుపేదల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక గొప్ప భరోసా అని, నియోజకవర్గంలోని 72 మంది బాధితులకు రూ. 35 లక్షల విలువైన వైద్య సహాయం మంజూరైందని వివరించారు. ప్రతి గడపకూ ప్రభుత్వ ఫలాలు అందడమే నిజమైన అభివృద్ధి అని, అర్హులైన ఏ ఒక్కరూ నష్టపోకుండా పథకాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా నిధులను మంజూరు చేస్తోందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి పేదవాడి కష్టంలో పాలుపంచుకుంటూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మధు కమిషనర్ సుజాత సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, మండల ఎమ్మార్వో పుల్లయ్య, ఎంపీడీవో సుభాషిణి, ఎమ్మార్వో నాగరాజు, ఎక్సైజ్ సీఐ జయశ్రీ కార్పొరేటర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేసి 99 రోజుల కార్యచ రణతో సత్ఫలి తాలు సాధించాలి

- మహా సంకల్ప్, ఉమ్మడి ఖమ్మం
- ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్నివిజయవంతం చేద్దాం..



**ఉమ్మడి ఖమ్మం :** ప్రజాప్రతినిధులు.. అధికారులు సమన్వయంతో పని చేసి 99 రోజుల కార్యాచరణతో సత్ఫలితాలు సాధించాలి. శ్రీ చెలికాని ఆదెమ్మ ఫంక్షన్ హాల్ సమావేశమందిరం లో జరిగిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ అధికారులతో కలిసి పాల్గొనడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం ప్రజలకు మరింత మేలైన పాలన అందించాలనే లక్ష్యంతో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దానిలో భాగంగా నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు దిశానిర్దేశం చేయడం జరిగింది,99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ప్రతి కార్యక్రమాలను అధికారులు అంకిత భావంతో పని చేసి విజయవంతం చేయాలి. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి. ప్రజాపాలన-పట్టణ ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో పారిశుధ్యం మరియు ఆరోగ్యం, అరైవ్ అలైవ్ (రోడ్డు భద్రత), సంక్షేమం, పిల్లల రక్షణ మరియు డ్రగ్స్ నిర్మూలన, రైతు సంక్షేమం మరియు వ్యవసాయం, విద్య, యువత మరియు క్రీడలు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. నియోజకవర్గ అభివృద్ధి కోసం చేసే ఈ ప్రణాళికలో అధికార, ప్రతిపక్ష పార్టీలనే భేదం లేకుండా అందరు భాగస్వాములవ్వాలి. ముఖ్యంగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో అధికారులు మరింత శ్రద్ధ వహించి ప్రభుత్వ ఆలోచనలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. ప్రజాప్రతినిధుల సహకారంతో స్థానికంగా చేయవలసిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను అందజేస్తే, ప్రాధాన్యత ఆధారంగా ప్రభుత్వం నిధులను కేటాయించడానికి సిద్ధంగా ఉంది.

99 రోజుల అభివృద్ధి ప్రణాళికలో ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ఈ శిక్షణ కార్యక్రమంలో నూతన ప్రజాప్రతినిధులకు ఎంతగానో ఉపయోగపడుతుంది ఈ కార్యక్రమంలో సర్పంచులు,అధికారులు,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు....

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక తో ప్రజలకు మెరుగైన సేవలు

- ప్రజలతో మమేకమై అభివృద్ధి సాధించాలి
- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకువెళ్లాలి
- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్.జి

**ములుగు :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నట్లు అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్.మహేందర్.జి తెలిపారు.

స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు ప్రజలతో మమేకమై సంపూర్ణ సమగ్ర అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజలలోకి తీసుకువెళ్లాలని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నా 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఆర్డీవో వెంకటేష్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి,అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి హాజరై రాష్ట్ర గేయాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.




ఈ సందర్భంగా సంబంధిత శాఖ అధికారులు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్ ప్లాన్ లో భాగంగా చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి వివరాలను పి పి టి ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి, మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్ ప్లాన్ లో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, త్వరలో అమలు చేయబోయే మరిన్ని సంక్షేమ పథకాలకు గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో సమగ్రంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సంబంధిత శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.ప్రజాపాలన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జనగణలో భాగంగా ప్రతి ఒక్కరూ ఏప్రిల్ 26వ తేదీ నుంచి,మే 10వ తేదీ వరకు జరుగుతున్న సెల్ఫ్ ఎన్యునరేషన్ లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు రూపొందించిన యాక్షన్ ప్లాన్ తో ముందుకు సాగాలని ప్రజలు అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలి కోరారు.

ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్ పర్సన్ చింత నిప్పుల చంద్రకళ మాట్లాడుతూ మున్సిపాలిటీ నూతన పాలకవర్గం ఏర్పడిన అనంతరం ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని తీసుకురావడం సంతోషకరంగా ఉందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో రెండు కొత్త బోర్ వేల్స్ ను వేయడం జరిగిందని, ఆరు పాత బోర్వెల్స్ ను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేశామని, వేసవికాలం దృష్ట్యా ఐదు చలివేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 20 వార్డులలోని సమస్యలను స్థానిక కౌన్సిలర్లతో పర్యవేక్షించి పరిశీలించడం జరుగుతుందని వాటిని త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి రవీందర్, మున్సిపాలిటీ వైస్ చైర్పర్సన్ ఆసియా షాహిన్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, జిల్లా అధికారులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాత్రి పూట కాఫీ తాగితే నిద్రకే కాదు.. ఈ విషయాల్లోనూ సమస్యలే వస్తాయి..



చాలా మంది కాఫీని ఇష్టంగా తాగుతూ ఉంటారు. పగటి పూట మాత్రమే కాకుండా రాత్రి కూడా కాఫీని తాగుతూ ఉంటారు. ఇలా రాత్రి సమయంలో కాఫీ తాగడం వల్ల నిద్ర భంగం అవుతుందన్న సంగతి అందరికీ చాలాకాలంగా తెలిసిందే. అయితే తాజా పరిశోధన ప్రకారం, ఇది కేవలం నిద్రపై ప్రభావం చూపడమే కాకుండా ప్రవర్తనపై కూడా ప్రభావం చూపిస్తుందని వెల్లడైంది. ముఖ్యంగా మహిళల్లో ఆత్రుత ప్రమాదకర నిర్ణయాల వైపు మొగ్గు చూపే అవకాశముందని అధ్యయనం చెబుతోంది. కాఫీలో ఉండే కెఫీన్ శక్తివంతమైన ఉద్దీపక పదార్థం. ఇది మెదడులో నిద్రను ప్రోత్సహించే అడెనోసిన్ అనే రసాయనాన్ని నిరోధించి మేల్కొలుపును పెంచుతుంది. అందుకే రాత్రివేళ కాఫీ తాగితే నిద్రపోవడం కష్టమవుతుంది.ఆలోచించకుండా స్పందించే అవకాశం..కానీ తాజా పరిశోధనలు ఈ ప్రభావం నిద్రకే పరిమితం కాదని సూచిస్తున్నాయి. ఈ అధ్యయనం ప్రకారం, రాత్రి సమయంలో కెఫీన్ తీసుకున్నప్పుడు ప్రవర్తన నియంత్రణ తగ్గే అవకాశం ఉంటుందని తేలింది. పరిశోధకులు ఫ్రూట్ ఫ్లైస్‌పై చేసిన పరీక్షల్లో, రాత్రివేళ కెఫీన్ తీసుకున్న వాటిలో ఆలోచించకుండా స్పందించే స్వభావం ఎక్కువగా కనిపించినట్లు గుర్తించారు. అవి ప్రతికూల పరిస్థితుల్లో కూడా తమ చర్యలను నియంత్రించలేకపోయినట్లు గమనించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఇదే ప్రభావం పగటిపూట కెఫీన్ తీసుకున్నప్పుడు కనిపించలేదు. అంటే కాఫీ తాగే సమయం చాలా కీలకమని ఈ అధ్యయనం స్పష్టం చేసింది. మహిళల్లో ఈ ప్రభావం మరింతగా ఉంటుందని పరిశోధన సూచిస్తోంది .మహిళల్లో వేరుగా..హార్మోన్లు, మెటబాలిజం, మెదడు రసాయనాల వ్యత్యాసాల కారణంగా కెఫీన్ ప్రభావం మహిళల్లో వేరుగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇదే కారణంగా మహిళల్లో ఆత్రుత, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు ఎక్కువగా కనిపించే అవకాశం ఉంటుంది. కెఫీన్ మెదడులో డోపమైన్, నోరెపినెఫ్రిన్ వంటి న్యూరోట్రాన్స్‌మిటర్లను ఉత్తేజితం చేస్తుంది. ఇది దృష్టి కేంద్రీకరణకు సహాయపడినా, అధిక స్థాయిలో ఉంటే మెదడును అతిగా ఉత్తేజితం చేస్తుంది. ముఖ్యంగా రాత్రి సమయంలో శరీరం విశ్రాంతికి సిద్ధమవుతున్నప్పుడు ఇది సహజ రిథమ్‌ను దెబ్బతీస్తుంది.

# రిటైర్మెంట్ ఆలోచన లేదు: స్టార్క్



ఐపీఎల్ 2026లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. సుదీర్ఘ విరామం, గాయాల తర్వాత ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ స్టేడియంలో అడుగుపెట్టాడు. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో రాజస్థాన్ రాయల్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో మిచెల్ స్టార్క్ తన రీ-ఎంట్రీని ఘనంగా చాటుకున్నాడు. రాజస్థాన్ బ్యాటర్లను వణికించి 3 కీలక వికెట్లు పడగొట్టి ఢిల్లీ విజయంలో కీలక పాత్ర పోషించాడు.అయితే మ్యాచ్ సమయంలో స్టార్క్ బౌలింగ్ చేతికి భారీగా కట్లు ఉండటం చూసి అతని ఫిట్ నెస్ ఇంకా పూర్తిస్థాయిలో లేదని.. త్వరలోనే ఆయన ఆటకు స్వస్తి పలుకుతాడని సోషల్ మీడియాలో వార్తలు గుప్పుమన్నాయి.ఈ పుకార్లకు మిచెల్ స్టార్క్ మ్యాచ్ అనంతరం ముగింపు పలికాడు. తన రిటైర్మెంట్ గురించి వస్తున్న వార్తలపై స్పందిస్తూ.. "ప్రస్తుతానికి నాకు అలాంటి ఆలోచనే లేదు. చేతికి కట్లు ఉండటం చూసి రిటైర్మెంట్ గురించి మాట్లాడటం కాస్త వింతగా ఉంది. నేను ఇంకా ఆ దశకు చేరుకోలేదని భావిస్తున్నాను" అని మిచెల్ స్టార్క్ స్పష్టం చేశాడు. గత కొన్ని నెలలుగా క్రికెట్‌కు దూరంగా ఉండి.. కేవలం ఫిట్‌నెస్, గాయాల నుంచి కోలుకోవడంపైనే దృష్టి సారించానని, ఇప్పుడు మైదానంలోకి తిరిగి రావడం తనలో ఎంతో ఉత్సాహాన్ని నింపిందని స్టార్క్ కుండబద్దలు కొట్టాడు. 35 ఏళ్ల వయసులో కూడా తనలో ఇంకా చాలా క్రికెట్ మిగిలి ఉందని ఈ సందర్భంగా స్టార్క్ చాటిచెప్పాడు.రాజస్థాన్ ఇన్నింగ్స్ ప్రారంభమైన మొదటి ఓవర్‌లోనే మిచెల్ స్టార్క్ తన సత్తా ఏంటో చూపించాడు. యువ సంచలనం యశస్వి జైస్వాల్ మొదటి రెండు బంతుల్లోనే భారీ సిక్సర్‌తో స్టార్క్‌ను స్వాగతించినప్పటికీ.. స్టార్క్ మాత్రం తడబడలేదు. మూడో బంతికే అద్భుతమైన డెలివరీతో జైస్వాల్‌ను ఔట్ చేసి ప్రతీకారం తీర్చుకున్నాడు. ఆ తర్వాత సెంచరీకి చేరువవుతున్న రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్‌తో పాటు రవీంద్ర జడేజా వికెట్లను కూడా తీసి రాజస్థాన్ స్కోరు వేగానికి బ్రేకులు వేశాడు. 4 ఓవర్లలో 40 పరుగులు ఇచ్చి 3 వికెట్లు పడగొట్టి తన రాకను ఘనంగా చాటాడు.దాదాపు 3 నెలల పాటు ఏ బ్యాటర్‌కు బౌలింగ్ చేయకుండా నేరుగా ఐపీఎల్ లాంటి హై-వోల్టేజ్ టోర్నీలో ఆడటం అంత సులభం కాదని స్టార్క్ అంగీకరించాడు. "బౌలింగ్ స్పీడ్ అందుకోవడానికి, మ్యాచ్ రిథమ్‌లోకి రావడానికి ఈ మ్యాచ్ నాకు బాగా ఉపయోగపడింది. నా మోచేయి గాయం కారణంగా కొన్ని పరిమితులు ఉన్నప్పటికీ.. దానికి తగ్గట్టుగా బౌలింగ్ శైలిని మార్చుకుంటున్నాను. ఈ విజయం జట్టుకు ఎంత ముఖ్యమో, నా ఆత్మవిశ్వాసానికి కూడా అంతే ముఖ్యం. రాబోయే మ్యాచ్‌ల్లో నా బౌలింగ్ ప్రదర్శన మరింత మెరుగుపడుతుందని నమ్ముతున్నాను" అని స్టార్క్ ఆశాభావం వ్యక్తం చేశాడు.

# వైభవ్ సూర్యవంశీని చూసి భయపడ్డాను

### వైభవ్ సూర్యవంశీ భయం లేని ఆటగాడు

### ఢిల్లీ స్టార్ పేసర్ కైల్ జేమీసన్ ప్రశంసా



వైభవ్ సూర్యవంశీ ఆటతీరును ప్రశంసించాడు. "నా జీవితంలో 15 ఏళ్ల పిల్లాడిని చూసి ఇంతలా భయపడతానని ఎప్పుడూ అనుకోలేదు. కానీ వైభవ్ భయం లేని ఆటగాడు. అతని కోసం మేము ప్రత్యేక ప్రణాళికలు రచించాం. రాజస్థాన్ జట్టుకు ఓపెనర్లు వైభవ్, జైస్వాల్ ఇచ్చే ఆరంభం చాలా కీలకం. అందుకే వారిని త్వరగా ఔట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆ ప్లాన్ వర్కౌట్ అయినందుకు చాలా సంతోషంగా ఉంది. అందుకే అలా సెలబ్రేషన్ చేశాను." అని కైల్ జేమీసన్ పేర్కొన్నాడు.రాజస్థాన్ రాయల్స్ జట్టు టాపార్డర్‌ను దెబ్బతీయడమే తమ ప్రధాన ఉద్దేశమని జేమీసన్ వివరించాడు. పవర్‌ప్లేలో పరుగుల వేగాన్ని అడ్డుకోవడానికి మిచెల్ స్టార్క్, తాను కలిసి చేసిన ప్రయత్నం ఫలించిందని చెప్పాడు. స్టార్క్ హై ఫుల్ టాస్‌తో ఒక వికెట్ తీయగా.. తాను అద్భుతమైన యార్కర్‌తో వైభవ్ వికెట్ తీయడం వల్ల రాజస్థాన్ భారీ స్కోరు చేసే అవకాశాన్ని అడ్డుకోగలిగామని తెలిపాడు. జేమీసన్ మాటలు ఎలా ఉన్నా.. మైదానంలో అతను ప్రదర్శించిన దూకుడును బీసీసీఐ తీవ్రంగా పరిగణించింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు అతనికి ఓ డెమెరిట్ పాయింట్‌తో పాటు జరిమానా కూడా విధించింది. జేమీసన్ కూడా తన తప్పును అంగీకరించడంతో మ్యాచ్ రిఫరీ శిక్షను ఖరారు చేశారు. ఢిల్లీ మ్యాచ్ గెలిచినప్పటికీ, జేమీసన్ ప్రవర్తన మాత్రం ఈ మ్యాచ్‌లో ఓ మాయని మచ్చలా మిగిలిపోయింది.



# రఫ్ఫాడించిన రాహుల్, నిస్సంక

రాజస్థాన్ రాయల్స్?పై దిల్లీ క్యాపిటల్స్ రఫ్ఫాడించింది. గత మ్యాచ్‌లో ఆర్సీబీపై 75 పరుగులకే కుప్పకూలిన దిల్లీ రాజస్థాన్‌పై పంజా విసిరింది. 226 పరుగుల భారీ టార్గెట్‌ను సైతం అలవోకగా ఛేదించింది. ఫలితంగా హ్యాట్రిక్ ఓటముల తర్వాత గెలుపు బాట పట్టింది. ఓపెనర్లు కేఎల్ రాహుల్ (75 పరుగులు), పాథుమ్ నిస్సంక (62 పరుగులు) మెరుపు హాఫ్ సెంచరీలతో రాణించడంతో భారీ ఛేదనను దిల్లీ 19.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రాజస్థాన్ బౌలర్లలో రవీంద్ర జడేజా, తుషార్ దేశ్‌పాండే, జోఫ్రా ఆర్చర్ తలో 1 వికెట్ పడగొట్టారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 225 పరుగులు చేసింది. కెప్టెన్ రియాన్ పరాగ్ (90 పరుగులు) సత్తా చాటాడు. ధ్రువ్ జురెల్ (42 పరుగులు) రాణించాడు. చివర్లో డోనొవన్ ఫరీర్ (47 పరుగులు, 14 బంతుల్లో) రెచ్చిపోయాడు. దీంతో రాజస్థాన్‌కు భారీ స్కోర్ దక్కింది. దిల్లీ బౌలర్లలో మిచెల్ స్టార్క్ 3, కైల్ జెమీసన్, అక్షర్ పటేల్, నటరాజన్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. తాజా విజయంతో దిల్లీ ప్లేఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. ఆ జట్టు ఇప్పటిదాకా 9 మ్యాచ్‌లు ఆడగా నాలుగింట్లో నెగ్గింది. ఐదు మ్యాచ్‌ల్లో ఓడింది. 8 పాయింట్లతో ప్రస్తుతం ఆరో స్థానానికి దూసుకెళ్లింది. మరోవైపు, రాజస్థాన్ 10 మ్యాచ్‌ల్లో నాలుగో ఓటమితో నాలుగో ప్లేస్‌లో కొనసాగుతోంది.

# బ్యాట్‌తో కుల్దీప్ ముఖంపై కొట్టబోయిన జడేజా..



ఐపీఎల్ 2026లో భాగంగా నిన్న రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆసక్తికర సంఘటన జరిగింది. రాజస్థాన్ టీమ్‌కు చెందిన రవీంద్ర జడేజా, ఢిల్లీ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మధ్య ఈ ఘటన జరిగింది. అయితే వీరిద్దరూ కొట్టుకునే స్థాయికి వెళ్లారని చూపరులకు కనిపిస్తుంది. కానీ, అక్కడ జరిగింది అందుకు పూర్తి విరుద్ధం. రాజస్థాన్ రాయల్స్ జట్టు బ్యాటింగ్ చేస్తున్న క్రమంలో ధ్రువ్ జూరెల్ అవుటైన తర్వాత 12వ ఓవర్‌లో జడేజా బ్యాటింగ్‌కు వచ్చాడు. అదే సమయంలో ఈ విచిత్ర సంఘటన జరిగింది. రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌లు ఒకరినొకరు సరదాగా ఆటపట్టించుకోవడం కనిపించింది. ఇప్పుడు అందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. కుల్దీప్ తన వైపు రావడం గమనించిన జడేజా, తన టీమ్‌ఇండియా పార్ట్‌నర్‌ను భయపెట్టాలనే ఉద్దేశంతో వ్యూహాత్మకంగా బ్యాట్ ఝుళిపించాడు. అయితే, కుల్దీప్ ఏమాత్రం చలించకుండా, జడేజా భుజాలపై చేతులు వేసి తేలికగా నెట్టాడు. జడేజా తన బ్యాట్‌ను అంపైర్‌తో తనిఖీ చేయించుకోబోతుండగా, కుల్దీప్ అతడిని పట్టుకుని మళ్లీ నెట్టాడు. వారి మధ్య జరిగిన ఈ సరదా వాగ్వాదం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇదిలా ఉండగా.. ఈ మ్యాచ్ ద్వారా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు వరుసగా మూడు ఓటముల పరంపరకు ముగింపు పలికి, ఐపీఎల్‌లో తమ అత్యధిక విజయవంతమైన ఛేజింగ్‌ను పూర్తి చేసింది. జైపూర్‌లో 226 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తున్న క్రమంలో, ఓపెనర్లు కేఎల్ రాహుల్, పతుమ్ నిస్సంకల అర్ధశతకాల చెలరేగిన వేళ రాజస్థాన్ రాయల్స్ జట్టుపై ఢిల్లీ ఘనవిజయం సాధించింది. పతుమ్ నిస్సంక 33 బంతుల్లో 62 పరుగులతో ఛేజింగ్‌లో రాజస్థాన్ జట్టుపై అద్భుతమైన ఆరంభాన్ని అందించగా, కేఎల్ రాహుల్ 40 బంతుల్లో 75 పరుగులు చేసి ఢిల్లీని విజయానికి చేరువ చేశాడు. నిస్సంకతో కలిసి 110 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం నెలకొల్పిన సమయంలో రాహుల్ అతనికి సహకరించినప్పటికీ, నిస్సంక అవుటైన తర్వాత డీసీ ఇన్నింగ్స్‌కు ఎంతో అవసరమైన ఊపునిచ్చాడు. చివరికి, నితీష్ రాణా (33), అశుతోష్ శర్మ (25లి), ట్రిస్టన్ స్టబ్స్ (18లి) అందించిన విలువైన ఇన్నింగ్స్‌తో రాణించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్ 50 బంతుల్లో 90 పరుగులు చేసి ఫామ్‌లోకి తిరిగి వచ్చాడు. ఇది ఈ సీజన్‌లో అతని మొదటి యాభైకి పైగా స్కోరు. అదే సమయంలో, డోనోవన్ ఫెరీరా 14 బంతుల్లో 47 నాటౌట్ పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో, బ్యాటింగ్ ఎంచుకున్న == జట్టు 225/6 అనే బలమైన స్కోరును నమోదు చేసింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో 'వేపింగ్' చేస్తూ పట్టుబడి జరిమానాకు గురైన పరాగ్, తొలి రెండు ఓవర్లలోనే యశస్వి జైస్వాల్ (6), వైభవ్ సూర్యవంశీ (4) అవుటైన తర్వాత, ధృవ్ జురెల్ (42)తో కలిసి ఇన్నింగ్స్‌ను పటిష్టం చేశాడు.

# మీరు చదివే ప్రతిదానిని నమ్మకండి

### - క్రీడా వ్యాఖ్యాత యెషా సాగర్



గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఒక యువ క్రికెటర్ మరియు మహిళా యాంకర్ మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోందని, అందులో ఆ క్రికెటర్ ఆమెను తీవ్రంగా నియంత్రిస్తున్నాడని వార్తలు గుప్పుమన్నాయి. జర్నలిస్ట్ అభిషేక్ త్రిపాఠి చేసిన కొన్ని పరోక్ష వ్యాఖ్యలు ఈ వివాదానికి ఆజ్యం పోశాయి. అధికారికంగా పేర్లు వెల్లడించనప్పటికీ, నెటిజన్లు మాత్రం ఆ జంట సమీర్ రిజ్వీ, యెషా సాగర్ అని ఒక నిర్ణయానికి వచ్చేశారు.సమీర్ రిజ్వీ తనపై మత మార్పిడి కోసం ఒత్తిడి చేస్తున్నాడని, క్రీడా వ్యాఖ్యాతగా పని చేస్తున్న సమయంలో ఇతర క్రికెటర్లతో షేక్ హ్యాండ్ చేయకుండా కేవలం నమస్కారం మాత్రమే చేయాలని షరతులు విధించాడని వార్తలు వచ్చాయి. అంతేకాకుండా, ఆమె సామాజిక మాధ్యమ ఖాతాల నుంచి కొన్ని రకాల ఫొటోలను తొలగించాలని కూడా ఒత్తిడి తెచ్చినట్లు ప్రచారం జరిగింది. ఇవి అత్యంత సున్నితమైన అంశాలు కావడంతో ఈ వివాదం పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది.ఈ వివాదం మరింత ముదురుతుండటంతో యెషా సాగర్ తన సోషల్ మీడియా వేదికగా ఒక రహస్య సందేశాన్ని పంచుకున్నారు. "సోషల్ మీడియాలో మీరు చూసే లేదా చదివే ప్రతిదానిని నమ్మకండి" అని ఆమె పేర్కొన్నారు. దీని ద్వారా సమీర్ రిజ్వీతో తనపై వస్తున్న ఆరోపణలను ఆమె పరోక్షంగా ఖండించారు. అయితే, సమీర్ రిజ్వీ ఇప్పటివరకు ఈ విషయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇరు పక్షాలు ప్రస్తుతం ఈ సున్నితమైన అంశంపై మౌనాన్ని పాటిస్తున్నాయి. యెషా సాగర్ ప్రముఖ క్రీడా వ్యాఖ్యాత, మోడల్. పంజాబ్‌లోని లూథియానాలో జన్మించిన ఆమె, ఉన్నత చదువుల కోసం కెనడా వెళ్లారు. తొలుత పంజాబీ మ్యూజిక్ వీడియోల ద్వారా గుర్తింపు పొందిన ఆమె, తర్వాత క్రీడా రంగంపై ఆసక్తితో వ్యాఖ్యాతగా మారారు. గ్లోబల్ టీ20 కెనడా, యూపీ టీ20 లీగ్, మహిళా ప్రీమియర్ లీగ్ వంటి వేదికలపై ఆమె పనిచేశారు. నివేదికల ప్రకారం, యూపీ టీ20 లీగ్ సమయంలో సమీర్ రిజ్వీతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్‌లో సమీర్ రిజ్వీ ఢిల్లీ క్యాపిటల్స్ తరపున అద్భుతంగా రాణిస్తున్నారు. ఇప్పటివరకు ఆడిన 7 ఇన్నింగ్స్‌ల్లో 149.28 స్ట్రైక్ రేట్‌తో 209 పరుగులు చేశారు. గతంలో చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడినప్పటికీ, ఈ ఏడాది ఢిల్లీ జట్టులో ఆయన కీలక ఆటగాడిగా మారారు.




# జూన్ 26న లెనిన్ విడుదల

'ఏజెంట్'వంటి డిజాస్టర్ తర్వాత 'లెనిన్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యాడు అఖిల్ అక్కినేని. ఇటీవల ఈ చిత్రం గురించి కింగ్ నాగార్జున పాజిటివ్‌గా స్పందించడంతో.. అక్కినేని అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మురళి కిషోర్ అబ్బురు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై టాలీవుడ్ వర్గాల్లో ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. ఇది అఖిల్ కెరీర్‌ను మలుపు తిప్పే చిత్రమవుతుందని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు. అయితే లెనిన్ సినిమా విడుదల తేదీపై గత కొన్ని రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు ఇప్పుడు తెరపడింది. లెనిన్ వాయిదా పడుతందనే వార్తలు వచ్చినప్పటికీ.. తాజాగా పరిస్థితులు అనుకూలించాయి. రామ్ చరణ్ 'పెద్ది' సినిమాను జూన్ 4న విడుదల చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడంతో ఎలాంటి పోటీ లేకుండా జూన్ 26న 'లెనిన్' సోలోగా బాక్సాఫీస్ వద్ద సందడి చేసేందుకు మార్గం సుగమమైంది. ఇతర పెద్ద సినిమాల పోటీ లేకపోవడం లెనిన్‌కు పెద్ద ప్లస్ పాయింట్‌గా మారుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

-----

# ఆస్కార్ అవార్డుల్లో సరికొత్త నిబంధనలు

## టాలెంట్‌ను ప్రోత్సహించే విధంగా మార్పులు

ద

ప్రపంచ సినిమా రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఆస్కార్ అవార్డుల 99వ ఎడిషన్ కోసం అకాడమీ సరికొత్త నిబంధనలను తీసుకువచ్చింది. 2027 ఆస్కార్ అవార్డులకు సంబంధించి అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ యాక్టింగ్, అంతర్జాతీయ సినిమాలు, సాంకేతిక విభాగాల్లో కీలక మార్పులు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం.. ఒకే నటుడు ఒకే జాబితాలో రెండు వేరువేరు సినిమాలకు నామినేట్ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటివరకూ నటీనటులు ఒక విభాగంలో ఒక సినిమాకు మాత్రమే నామినేట్ అయ్యే అవకాశం ఉండేది. దీనివల్ల టాలెంట్ ఉన్న నటులు ఒకే ఏడాది ఎన్ని చిత్రాల్లో గొప్ప ప్రదర్శనలు ఇచ్చినా, ఏదో ఒకదానితోనే సరిపెట్టుకోవాల్సి వచ్చేది. ఇకపై ఈ నిబంధనను తొలగించి ఎన్ని సినిమాలకు అయినా నామినేట్ చేసుకునే అవకాశాన్ని అకాడమీ కల్పించింది. అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో కూడా అకాడమీ కీలక మార్పులు చేసింది. ఒక దేశం నుంచి ఇప్పుడు ఒకటి కంటే ఎక్కువ సినిమాలు నామినేషన్లకు అర్హత సాధించొచ్చు. అలాగే, కేన్స్ లాంటి ప్రముఖ అంతర్జాతీయ చలనచిత్ర వేడుకల్లో అగ్ర పురస్కారాలు అందుకున్న సినిమాలు నేరుగా ఆస్కార్ బరిలో పోటీపడే అవకాశాన్ని కూడా అకాడమీ కల్పించింది. మరోవైపు అంతర్జాతీయ సినిమా కేటగిరీలో ట్రోఫీపై దేశం పేరుతో పాటు దర్శకుడి పేరును కూడా ముద్రించనున్నారు. సినిమా రంగంలో పెరుగుతున్న కృత్రిమ మేధ వినియోగంపై అకాడమీ కఠిన నిర్ణయం తీసుకుంది. రైటింగ్ (స్క్రీన్‌ప్లే) విభాగంలో రచయితలు రాసిన కథలను మాత్రమే పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలిపింది. ఏఐ సహాయంతో రాసిన వాటిని అనుమతించబోమని వెల్లడించింది. యాక్టింగ్‌లో కూడా కృత్రిమ మేధతో సృష్టించిన సీన్స్, మార్పులు చేసిన ప్రదర్శనలను అంగీకరించబోమని స్పష్టం చేసింది (ంఇజీటుపా ఃజీనిబ ంఎ). నటీనటులు నేరుగా చేసిన ప్రదర్శనలకే అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపింది. వచ్చే ఏడాది ఆస్కార్ అవార్డుల వేడుకలో ఈ నిబంధనలు అమలుకానున్నాయి. 99వ ఆస్కార్ అవార్డుల వేడుక మార్చి 14న లాస్ ఏంజెలెస్‌లో ఘనంగా జరగనుంది.



# బోల్డ్ సీన్స్‌పై కియారా యూ టర్న్


కన్నడ స్టార్ యష్ హీరోగా, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కియారా అద్వానీ కలిసి నటిస్తున్న టాక్సిక్ సినిమా తాజాగా సోషల్ మీడియాలో భారీ చర్చకు దారి తీసింది. ముఖ్యంగా సినిమాలోని బోల్డ్ కంటెంట్, దాని చుట్టూ తిరుగుతున్న గాసిప్‌లు, మరియు హీరోయిన్ కెరీర్‌పై దీని ప్రభావం.. ఇవన్నీ కలిపి ఈ ప్రాజెక్ట్‌ను మరింత హాట్ టాపిక్‌గా మార్చాయి. రీసెంట్ టైమ్స్ లో ఇండియన్ సినిమాల్లో బోల్డ్ కంటెంట్ పెరుగుతుందనేది స్పష్టమైన ట్రెండ్. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ప్రభావం, గ్లోబల్ కంటెంట్ ఎక్స్‌పోజర్ కారణంగా డైరెక్టర్లు మరింత రియలిస్టిక్, ఎమోషనల్ మరియు బోల్డ్ ట్రీట్‌మెంట్ వైపు మళ్లుతున్నారు. అయితే ఈ విషయంలో ఆడియన్స్ యాక్సెప్టెన్స్ మాత్రం ఇంకా మిక్స్డ్ గానే కనిపిస్తోంది. అర్బన్ ఆడియన్స్ ఈ మార్పులను స్వాగతిస్తున్నా, ఫ్యామిలీ ఆడియన్స్‌లో మాత్రం ఇంకా కొంత రిజర్వేషన్ ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో టాక్సిక్ లాంటి బోల్డ్ యాక్షన్ డ్రామా ఎంతవరకు కనెక్ట్ అవుతుందో అనేది ఆసక్తికర ప్రశ్నగా మారింది. ఇదే సమయంలో, కియారా అద్వానీ కెరీర్ లో ఈ సినిమా కీలక మలుపుగా భావించవచ్చు. ఇప్పటి వరకు గ్లామరస్, రొమాంటిక్, కమర్షియల్ రోల్స్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఈసారి మరింత బోల్డ్, ఇంటెన్స్ పాత్రను ఎంచుకోవడం ఒక రిస్కీ స్టెప్‌గా కనిపిస్తోంది. ఇది ఆమెను కొత్త రేంజ్‌కి తీసుకెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, అదే సమయంలో ఇమేజ్‌పై ప్రభావం చూపే అవకాశాన్ని కూడా విస్మరించలేం. ముఖ్యంగా సీన్ లెంగ్త్ లేదా ప్రెజెంటేషన్‌పై వచ్చిన తాజా గాసిప్‌లు, ఆమె కెరీర్ స్ట్రాటజీపై కొత్త చర్చలకు దారితీశాయి. ఈ సినిమాలో తాను నటించిన బోల్డ్ సీన్స్ ను ట్రిమ్ చేయాలని కృతి మేకర్స్ ను కోరినట్టు తెలుస్తోంది. షూటింగ్ టైమ్ లో ఈ సీన్స్ తన అనుమతితోనే జరిగినప్పటికీ, ఇప్పుడు ఫైనల్ అవుట్‌పుట్ చూశాక కృతికి ఇబ్బందిగా అనిపించి, తన డెసిషన్ ను మార్చుకున్నారని, అందుకే ఆ సీన్స్ ను సినిమాలో నుంచి తొలగించాలని డైరెక్టర్ ను సంప్రదించినట్టు తెలుస్తోంది. సాధారణంగా సినిమా షూట్ సమయంలో నటీనటులకు స్క్రిప్ట్, సీన్ బ్లాకింగ్, కెమెరా ట్రీట్‌మెంట్ గురించి ముందుగానే అవగాహన ఉంటుంది.



# వారణాసి కోసం జర్మనీలో మహేశ్‌బాబు

రాజమౌళి – మహేశ్ బాబు కాంబినేషన్‌లో రానున్న 'వారణాసి' కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం మహేశ్ బాబు జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్ లో ఉన్నారు. అక్కడ ఆయన ఫిట్‌నెస్, వెల్‌నెస్ నిపుణులు డాక్టర్ హ్యారీ కోనిగ్ పర్యవేక్షణలో కఠినమైన శిక్షణ పొందుతున్నారు. దీనికి సంబంధించిన ఫోటోలను మహేశ్ స్వయంగా తన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ట్రెక్కింగ్‌లో ట్రైనింగ్ తీసుకుంటూ వారణాసి కోసం సిద్ధమవుతున్నట్లు క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు వైరల్ అవుతున్నాయి. గ్లోబల్ ప్రేక్షకులను ఆకర్షించడమే లక్ష్యంగా రాజమౌళి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'వారణాసి' సినిమాతో మరిన్ని కొత్త మార్కెట్లనీ కొల్లగొట్టాలనే ప్రణాళికల్ని చిత్రబృందం సిద్ధం చేసింది. ముఖ్యంగా దక్షిణ అమెరికాతోపాటు, లాటిన్ అమెరికా దేశాల మార్కెట్‌పైన గురిపెట్టినట్టు తెలుస్తోంది. 'వారణాసి' కథ కూడా పలు దేశాలతో ముడిపడినది కావడం, కథానాయకుడు ప్రపంచాన్ని చుట్టే సాహసికుడు కావడంతో... మరిన్ని కొత్త దేశాలకు, కొత్త మార్కెట్లకీ ఈ సినిమాని తీసుకెళ్లాలనే ప్రణాళికలు రచిస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది.






# పృథ్వీరాజన్ సుకుమారన్...ఐ నోబడీ

మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్, టాలెంటెడ్ నటి పార్వతి తిరువోతు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం ఐ, నోబడీ.. 'రోషాక్' వంటి ప్రయోగాత్మక చిత్రంతో మెప్పించిన దర్శకుడు నిసామ్ బషీర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అఫీషియల్ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ టీజర్ చూస్తుంటే, సినిమా కథాంశం ఒక వ్యక్తి తన అస్తిత్వం కోసం చేసే పోరాటం లేదా రహస్యం చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ఒక సాధారణ ఉద్యోగి అనుకోకుండా కొన్ని క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకుంటాడు. ఆ ప్రమాదం నుండి తనను తాను కాపాడుకుంటూనే, తన కుటుంబాన్ని ఎలా రక్షించుకున్నాడు అనేదే ఈ చిత్ర ప్రధాన కథాంశంగా కనిపిస్తోంది. ఇందులో పృథ్వీరాజ్ సరికొత్త లుక్, పార్వతి నటన సినిమాపై భారీ అంచనాలను పెంచుతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్ ఈ చిత్రానికి ప్రధాన బలంగా నిలవనుంది. జేక్స్ బిజోయ్ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రాణం పోసింది. ప్రతి సన్నివేశాన్ని తన మ్యూజిక్‌తో ఆయన ఎంతో ఉత్కంఠభరితంగా మలిచారు.

# ఆధ్యాత్మిక రహస్యాల చుట్టూ తిరిగే 'అగధ'

ఆధ్యాత్మిక రహస్యాలు ఎప్పుడూ ఆసక్తిని కలిగిస్తూనే ఉంటాయి .. ఆశ్చర్యాన్ని రేకెత్తిస్తూనే ఉంటాయి. దైవిక శక్తులు .. అవి చూపించే ప్రభావం చుట్టూ ఈ తరహా కథలు నడుస్తూ ఉంటాయి. ఇలాంటి కథలు గతంలో ఎమ్మెస్ రాజు బ్యానర్లో రూపొందాయి. కథాకథనాల పరంగా అలరిస్తూ, బాక్సాఫీస్ దగ్గర భారీ విజయాలను నమోదు చేశాయి. అలాంటి ఎమ్మెస్ రాజు దర్శకత్వంలో రూపొందుతున్న సినిమానే 'అగధ'. టైటిల్ తో .. ఆ టైటిల్ ను డిజైన్ చేసిన తీరుతో అందరి దృష్టిని ఆకర్షించిన సినిమా ఇది. సీనియర్ నటి మంజుల మనవరాలు .. వనిత విజయ్ కుమార్ కూతురు 'జోవిక' ఈ సినిమాలో ప్రధానమైన పాత్రను పోషించింది. రీసెంటుగా వదిలిన ఆమె పోస్టర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఉల్కా గుప్తా .. కామాక్షి భాస్కర్ల పోస్టర్లు కూడా ఈ సినిమాపై అంచనాలు పెంచాయని చెప్పాలి. ఆదివరహా బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమా, ప్రస్తుతం పోస్టు ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఆధ్యాత్మిక రహస్యాలు .. దైవిక శక్తుల చుట్టూ తిరిగే కథ ఇది. అందువలన గ్రాఫిక్స్ కి ఎక్కువ అవకాశం ఉన్న కంటెంట్ ఇది. సినిమా నిడివిలో 45 నిమిషాల పాటు గ్రాఫిక్స్ ఉంటాయని చెబుతుండటం ఆడియన్స్ లో మరింత ఉత్కంఠను పెంచుతోంది. 85 రోజుల పాటు షూటింగు జరుపుకున్న ఈ సినిమా, త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. తెలుగు .. తమిళ .. మలయాళ .. కన్నడ .. హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ సినిమా, సంచలనాన్ని సృష్టించడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది.



Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com